ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనకాపల్లి

జిల్లా వార్తలు

ఆదివారం 23 మార్చి 2025

అప్రమత్తతతో క్షయకు చెక్

లక్షణాలు కనిపిస్తే పరీక్షలు తప్పనిసరి

- వ్యాధి బారినపడిన వారికి మెరుగైన వైద్యం అందిస్తున్న ప్రభుత్వం
- రేపు ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం

8లో



ఆక్రమణదారుల వీరంగం

ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను తొలగించేందుకు వెళ్లిన రెవెన్యూ సిబ్బందిపై దాడి

- ఎక్స్‌కవేటర్ అద్దాలు పగులగొట్టిన వైనం
- రెవెన్యూ సిబ్బందిపై దుర్భాషలు
- భయభ్రాంతులకు గురైన సిబ్బంది
- పోలీసులకు తహసీల్దార్ ఫిర్యాదు



సబ్బవరం సర్వే నంబరు 271లో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం



వీఆర్ఏ ముదపాక అప్పారావుపై దాడి చేస్తున్న ఆక్రమణదారులు

సబ్బవరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): **సబ్బవరంలో ఆక్రమణదారులు రెచ్చిపోయారు. ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను తొలగించేందుకు వెళ్లిన రెవెన్యూ సిబ్బందిపై దాడి చేశారు. కులం పేరుతో దూషించారు. రెవెన్యూ సిబ్బంది విధులకు అడ్డుపడి నానా యాగీ చేశారు. ఆక్రమణలు తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్ డ్రైవర్, సహాయకులపై కూడా దాడి చేశారు. ఇటుకలతో ఎక్స్‌కవేటర్ అద్దాలు పగులగొట్టి భయానక వాతావరణం సృష్టిం చారు. దీనిపై స్థానిక పోలీసులకు తహసీల్దార్ బి.చిన్నికృష్ణ ఫిర్యాదు చేశారు.**

దీనికి సంబంధించి తహసీల్దార్ బి.చిన్ని కృష్ణ, ఆర్ఐ వీరయ్య, వీఆర్ఏ ముదపాక అప్పారావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. సబ్బవరం సర్వే నంబర్లు 255 గెడ్డవాగు, 271 ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను తొలగించేందుకు తహసీల్దార్ బి.చిన్నికృష్ణ ఆదేశాల మేరకు ఆర్ఐ బి.వీరయ్య, వీఆర్వోలు వినోద్, నూకరత్నం శుక్రవారం మధ్యాహ్నం ఎక్స్‌కవేటర్‌తో సహా వెళ్లారు. సర్వే నంబరు 255లో ఆక్రమణలను తొలగించినప్పుడు ఆక్రమణదారులు దాడులకు తెగబడ్డారు. అయితే రెవెన్యూ సిబ్బంది అతి కష్టమ్మీద గెడ్డవాగులో వేసిన పైపులు, మట్టి రోడ్డును ధ్వంసం చేశారు. అనంతరం సబ్బవరం మండలం రావలమ్మపాలెం గ్రామానికి చెందిన గొంప ముత్యాలనాయుడు తన జిరాయితీ(279) భూమికి ఆనుకొని సర్వే నంబరు 271లోని ప్రభుత్వ భూమిలో సుమారు 20 సెంట్లు ఆక్రమించి, నిర్మించిన ప్రహరీ గోడను తొలగించేందుకు రెవెన్యూ సిబ్బంది వెళ్లారు. ఎక్స్‌కవేటర్‌తో ఆక్రమణలను తొలగిస్తుండగా ఆక్రమణదారుడు గొంప ముత్యాలనాయుడు, సబ్బవరం శివారు గొర్లివానిపాలేనికి చెందిన గొర్లి కుమార్‌స్వామి, లగుడు సత్యనారాయణ, గొర్లి శ్రీనివాసరావు అక్కడికి వచ్చి అడ్డుకున్నారు. వీఆర్వో వినోద్, వీఆర్ఏ ముదపాక అప్పారావుపై దాడి చేసి కొట్టారు. దుర్భాషలాడారు. విధులను అడ్డుకున్నారు. ఎక్స్‌కవేటర్ సిబ్బందిపై కూడా దాడి చేశారు. రాళ్లతో ఎక్స్‌కవేటర్ అద్దాలు పగులగొట్టి బీభత్సం సృష్టించారు. ఈ విషయాన్ని తహసీల్దార్‌కు తెలియజేయడంతో ఆయన ఆదేశాల మేరకు వీఆర్ఏ, ఆర్ఐ శుక్రవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఆక్రమణదారుల దౌర్జన్యంపై పోలీసులకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఆక్రమణదారుల దాష్టీకంపై సీఐ పిన్నింటి రమణకు తాను కూడా నేరుగా ఫిర్యాదు చేశానన్నారు.

రెవెన్యూ సిబ్బందిపై దౌర్జన్యాన్ని ఖండించిన ఎంఆర్‌పీఎస్

రెవెన్యూ సిబ్బందిపై ఆక్రమణదారుల దౌర్జన్యాన్ని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు జి.సామ్రాట్‌కుమార్ ఖండించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే వీఆర్ఏ, వీఆర్వోలు విధులు నిర్వహిస్తారని, అటువంటి వారిపై వ్యక్తిగతంగా దాడి చేయడం, దుర్భాషలాడడం దారుణమన్నారు. వీఆర్ఏ అప్పారావు మాట్లాడుతూ గతంలో కూడా ఇటువంటి దాడులకు గురయ్యామని, తక్షణమే దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

గతంలో సీసీఎల్ఏకు ఫిర్యాదు

సబ్బవరం 271లో ఆక్రమణపై వైసీపీ ప్రభుత్వ హయాంలో (2022-23) ఓ వ్యక్తి స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పట్లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. రెండోసారి నేరుగా సీసీఎల్ఏ (చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్)కు ఫిర్యాదు చేశారు. అయితే సీసీఎల్ఏ ఆదేశాలతో అప్పటి రెవెన్యూ అధికారులు మొక్కుబడి చర్యలతో నివేదికను పంపించారు. అప్పటి నుంచి ఈ కేసు సీసీఎల్ఏలో పెండింగ్‌లో ఉంది. కూటమి ప్రభుత్వంలో పెండింగ్ ఫిర్యాదులు క్లియర్ చేయడంలో భాగంగా సర్వే నంబరు 271లో ఆక్రమణలు తొలగించాలని మరోసారి సీసీఎల్ఏ నుంచి తహసీల్దార్‌కు ఆదేశాలు వచ్చాయి. దీంతో సిబ్బంది శుక్రవారం ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు చేపట్టారు.

ఐఐపీయూఈ భూములపై

హైకోర్టు తీర్పు

- డీకేటీ పట్టాదారులకు ఎకరాకు రూ.13 లక్షల పరిహారం చెల్లించండి
- వ్యవసాయ కూలీలకు కొత్త భూసేకరణ చట్టం ప్రయోజనాలు కల్పించండి
- నాలుగు నెలల్లో తగిన ఉత్తర్వులు జారీ చేయండి
- భూసేకరణ అధికారికి హైకోర్టు ఆదేశం

అమరావతి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం వంగలి గ్రామపరిధిలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం యూనివర్సిటీ అండ్ ఎనర్జీ (ఐఐపీయూఈ) నిర్మాణం కోసం జరిపిన భూసేకరణలో భూములు కోల్పోయిన డీకేటీ పట్టాదారులకు రూ.13 లక్షలు పరిహారం చెల్లించాలని అధికారులను హైకోర్టు ఆదేశించింది. జిల్లా కలెక్టర్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాల్లో ఎకరా మార్కెట్ విలువ రూ.13 లక్షలుగా పేర్కొన్నందున అంతే మొత్తం పరిహారం పొందేందుకు డీఫామ్ పట్టా రైతులు అర్హులని తేల్చి చెప్పింది. చట్ట నిబంధనల ప్రకారం వడ్డీ, ఇతర ప్రయోజనాలు చెల్లించాలని అధికారులకు స్పష్టం చేసింది. జీవనాధారం కోల్పోయిన వ్యవసాయ కూలీలకు కొత్త భూసేకరణ చట్టానికి అనుగుణంగా ప్రయోజనాలు కల్పించాల్సిందేనని స్పష్టం చేసింది. వారికి ప్రయోజనాల కల్పనపై నాలుగు నెలల్లో తగిన ఉత్తర్వులు జారీ చేయాలని భూసేకరణ అధికారిని ఆదేశించింది. ఎలాంటి పట్టా లేకుండా భూమిని సాగు చేసుకుంటున్నవారు భూసేకరణ చట్టంలోని సెక్షన్3(ఆర్) ప్రకారం ల్యాండ్ ఓనర్ నిర్వచనం పరిధిలోకి రారని, ఈ నేపథ్యంలోవారు పరిహారం కోరలేరంది. పునరావాస ప్రయోజనాలు కింద వారికి రావాల్సిందానికంటే ... మిగతా 8వ పేజీలో

గోవాడలో రూ.300 కోట్లతో డిస్టిలరీ

డీపీఆర్ తయారు చేయాలని సీఎం ఆదేశం

- చెరకు సాగు ద్వారా నష్టాలతో ఫ్యాక్టరీ నడపడం సాధ్యం కాదు
- త్వరలోనే అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ ఆధ్వర్యంలో గోవాడపై అఖిలపక్షం
- నూరు శాతం సహకార రంగంలోనే డిస్టిలరీ నిర్వహణ
- గోవాడ రైతులకు న్యాయం చేసే బాధ్యత నాదే..
- ఫ్యాక్టరీకి ఐఏఎస్ అధికారిని నియమించాలని కోరాం
- ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు



తాజాగా సీఎం చంద్రబాబును కలిసి గోవాడపై చర్చిస్తున్న చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేలు కేఎస్ఎన్ఎస్ రాజు, బండారు సత్యనారాయణమూర్తి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): గోవాడలో రూ.300 కోట్లతో డిస్టిలరీ ఏర్పాటుకు సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని, డీపీఆర్ తయారీకి పరిశ్రమ ల శాఖ కార్యదర్శిని ఆదేశించారని స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు వెల్లడించారు. శనివారం సాయంత్రం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీ సమస్యపై తాను, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అసెంబ్లీ సమావేశాల చివరి రోజున సీఎంను కలిసి గోవాడలో పరిస్థితి వివరించి డిస్టిలరీ లేదా ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుకు విజ్ఞప్తి చేశామన్నారు. కేంద్ర సహకారంతో ఈ ప్రాజెక్టు చేపట్టేందుకు గల అవకాశాలను పరిశీలించాలని కోరిన మీదట సీఎం సానుకూలంగా స్పందించి వెంటనే డీపీఆర్ తయారీకి పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి యువరాజ్‌కు ఆదేశాలిచ్చారన్నారు. గోవాడలో డిస్టిలరీ ఏర్పాటుకు ప్రభుత్వం గ్యారంటీదారుగా ఉండి, 6 శాతం వడ్డీకి రుణం మంజూరు చేయిస్తుందని, 240 కిలో లీటర్ల సామర్థ్యం కలిగిన డిస్టిలరీ గోవాడలో ఏర్పాటయ్యే అవకాశం ఉందన్నారు. గోవాడ ఫ్యాక్టరీ నిర్వహణకు కూడా ఐఏఎస్ అధికారినే ఎండీగా నియమించాలని సీఎంను కోరామని తెలిపారు. కేవలం చెరకు సాగు ద్వారా ఫ్యాక్టరీని నడపడం కష్టసాధ్యం కాబట్టి, ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, ఇతర పంటల ద్వారా డిస్టిలరీ నిర్వహించి గోవాడను నిలబెట్టే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ఈ డిస్టిలరీ ఏర్పాటు పూర్తిగా సహకార రంగంలోనే నడిచేలా చూడాలని సీఎంను కోరామని ఆయన చెప్పారు. త్వరలోనే ఎంపీ సీఎం రమేశ్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం నిర్వహించబోతున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. ఈ అఖిల పక్ష సమావేశానికి అన్ని పక్షాలను ఆహ్వానించి గోవాడను అభివృద్ధి చేసే దిశగా అవసరమైన సలహాలు, సూచనలు తీసుకుంటామన్నారు. గోవాడను రాజకీయాలకు వేదికగా మార్చే ఉద్దేశం తనకు లేదని, ఎట్టి పరిస్థితుల్లో గోవాడ ... మిగతా 8వ పేజీలో

---

100 కిలోల గంజాయి స్వాధీనం

- రౌడీషీటరుతో పాటు ఇద్దరి అరెస్టు
- పరారీలో ఆటో డ్రైవర్, మరో రౌడీ షీటరు

నర్సీపట్నం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఆటోలో తరలిస్తున్న వంద కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని రౌడీ షీటర్‌తో పాటు ఇద్దరిని అరెస్టు చేసినట్టు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం సాయంత్రం పట్టణ పోలీస్ స్టేషన్‌లో విలేఖరుల సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి రవాణాపై ముందుగా అందిన సమాచారంతో ట్రైనీ డీఎస్పీ ఎంవీకే చైతన్య, ఎస్ఐ రమేశ్, ఏఎస్ఐ సాంబ.. పెదబొడ్డేపల్లి ఏపీ బాలుర గురుకుల పాఠశాల సమీపంలో వాహనాలు తనిఖీ చేపట్టారన్నారు. తాళ్లపాలెం వైపు వెళుతున్న ఆటోలోని ఇద్దరు పోలీసులను చూపి పరారయ్యారని తెలిపారు. ఆటో సీటు వెనుక తనిఖీ చేయగా నాలుగు బస్తాలతో వంద కిలోల గంజాయి లభ్యమైందని తెలిపారు. నర్సీపట్నానికి చెందిన రౌడీషీటరు గుడాల పార్థకీర్తి (27), చింతపల్లి మండలం తాజంగి కొరుకొండకి చెందిన మజ్జి గాంధీ (24), వంటల హరిబాబు (20)లను అరెస్టు చేసినట్టు ఆయన తెలిపారు.

జీకేవీధి మండలం జెర్రిల పరిసర ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తుల నుంచి గంజాయి కొనుగోలు చేసినట్టు నిందితులు విచారణలో తెలిపారని డీఎస్పీ చెప్పారు. వారి నుంచి వంద కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని, మూడు సెల్ ఫోన్లు, ఆటోని సీజ్ చేశామని తెలిపారు. పరారైన ఇద్దరులో ఆటో డ్రైవర్, నర్సీపట్నానికి చెందిన మరో రౌడీ షీటరు ఉన్నారన్నారు. నిందితులు గంజాయి వ్యాపారంలో ఆస్తులు సంపాదించినట్టు విచారణలో నిర్ధారణ అయితే వారి ఆస్తులు జప్తు చేస్తామని తెలిపారు. పట్టణ సీఐ గోవిందరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.13 (ఆదివారం సాయంత్రం)

సహర్ : 4.43 (సోమవారం ఉదయం)

ఆస్తి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో వసూళ్లు ప్రస్తుతం అంతంతమాత్రమే..

- ఆదివారం, సెలవు రోజుల్లో కూడా కౌంటర్లు తెరవాలని నిర్ణయం
- మొండి బకాయిదారులకు నోటీసుల జారీకి సన్నద్ధం



అనకాపల్లిలో జీవీఎంసీ జోనల్ కార్యాలయం

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి) **జిల్లాలో ఆస్తి పన్ను వసూళ్లు నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోలేదు. దీంతో శత శాతం వసూళ్లపై అధికారులు దృష్టి సారించారు. దీని కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని నిర్ణయించారు. ఆదివారంతో పాటు సెలవు రోజుల్లో కూడా కౌంటర్లు తెరిచే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు.**

అనకాపల్లి జీవీఎంసీ జోనల్ కార్యాలయం, నర్సీపట్నం, ఎలమంచిలి మునిసిపాలిటీల పరిధిలో ఆస్తి పన్ను వసూళ్ల కాస్త మెరుగ్గా ఉన్నా, జిల్లాలో గ్రామ పంచాయతీల పరిధిలో వసూళ్ల అంతంత మాత్రంగా ఉన్నాయి. ఈ నెలాఖరుతో 2023-24 ఆర్థిక సంవత్సరం ముగియనుండడంతో శత శాతం ఆస్తి పన్ను వసూళ్లపై అధికారులు దృష్టి సారించారు. ఇందులో భాగంగా మునిసిపల్, గ్రామ, వార్డు సచివాలయాలకు వివిధ పనులపై వచ్చిన వారిని ముందుగా సిబ్బంది ఆస్తి పన్ను చెల్లించారా?, లేదా? అని ప్రశ్నిస్తున్నారు. మొండి బకాయిదారులకు ఆస్తి జప్తు నోటీసులు జారీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

అనకాపల్లి జోనల్ పరిధిలో...

అనకాపల్లి జీవీఎంసీ జోనల్ కార్యాలయం పరిధిలో ఐదు రెవెన్యూ వార్డుల్లో ఇంటి పన్నులు ఉన్న అసెస్‌మెంట్ నంబర్లు 24 వేలకు పైగా ఉన్నాయి. ఈ ఏడాది రూ.14 కోట్లు పన్ను వసూలు చేసేందుకు లక్ష్యంగా నిర్దేశించారు. ఈ నెల 20వ తేదీ వరకు రూ.8 కోట్ల వరకు వసూలైనట్టు సంబంధిత శాఖ అధికారులు వెల్లడించారు. అనకాపల్లి పెరుగు బజారు కూడలి నుంచి రైల్వే స్టేషన్ వరకు రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారి నుంచి సుమారు రూ.2 కోట్లు పన్ను వసూలు జరిగే అవకాశం లేదు. ఆయా ప్రాంతాల వారిని మినహాయిస్తే జీవీఎంసీ జోన్ పరిధిలోని మిగిలిన రూ.5 కోట్లు ఈ నెలాఖరులోగా వసూలు చేయాల్సి ఉందని అధికారులు అంటున్నారు. జీవీఎంసీ పరిధిలో పన్ను వసూళ్లకు ఆదివారంతో పాటు ఇతర సెలవు దినాల్లో కౌంటరు తెరిచే విధంగా ఏర్పాట్లు చేశారు.

మునిసిపాలిటీల్లో కాస్త మెరుగు

నర్సీపట్నం, ఎలమంచిలి పరిధిలో ఆస్తి పన్ను వసూళ్లను అధికారులు వేగవంతం ... మిగతా 8వ పేజీలో



పాల్తేరులో వరి కుప్పలు నూర్పిడి చేస్తున్న దృశ్యం

అన్నదాత హ్యాపీ

- వరిలో అధిక దిగుబడులు
- జోరుగా వరి కుప్పల నూర్పిడి పనులు

పాయకరావుపేట రూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ ఏడాది వరి రైతుల పంట పండింది. ఖరీఫ్‌లో వాతావరణం అనుకూలించడంతో వరిలో మంచి దిగుబడులు వస్తున్నాయి. ప్రస్తుతం మండలంలో వరి కుప్పలు నూర్పులు జోరుగా సాగుతున్నాయి. మండలంలోని రైతులు వరి సాగు అనంతరం పైరు పంటగా అపరాలను సాగు చేస్తారు. పొలాల్లో వరి కుప్పలను నూర్చడానికి దారులు లేక అపరాల పంట ముగిసే వరకు రైతులు వరి కుప్పలు నూర్పులు చేపట్టరు. ప్రస్తుతం అపరాల పంట ముగియడంతో రైతులు వరి కుప్పలను నూర్పిడి చేస్తున్నారు. ఇప్పటికే గుంటపల్లి, గోపాలపట్నం, మాసాహెబ్‌పేట, పాల్తేరు, పెదరాంభద్రపురం గ్రామాలలో అధిక శాతం కుప్పలు నూర్పిడి చేశారు. మండలంలో సాగునీటి కాలువలు, చెరువులు, కింద సత్యవరం, మాసాహెబ్‌పేట, మంగవరం, గోపాలపట్నం, పెంటకోట, శ్రీరాంపురం, పెదరాంభద్రపురం, వెంకటనగరం, కేశవరం, రాజవరం, తదితర గ్రామాల్లో సుమారు మూడు వేల హెక్టార్లలో వరి పంట సాగు చేస్తున్నారు. సాధారణంగా మండలంలో వరి పంట బాగా పండితే ఎకరాకు 25 నుంచి 28 బస్తాల వరకు దిగుబడి వచ్చేది. అయితే ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభం నుంచి వాతావరణం అనుకూలించి వర్షాలు పడడంతో ఎకరాకు 30 నుంచి 33 బస్తాల వరకు దిగుబడులు వస్తున్నాయి. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా ప్రకృతి వైపరీత్యాల వలన వరి పంట చివర్లో రైతులు నష్టపోయేవారు. ఈ ఏడాది వరి కోతల సమయంలో ... మిగతా 8వ పేజీలో

బెట్టింగ్ భూతం

రూ.లక్షల్లో పోగొట్టుకుంటున్న విద్యార్థులు, ఉద్యోగులు

- ఆ ఊబిలో దిగితే అంతే సంగతులు
- జీవితాలు నాశనం
- ఐపీఎల్ ప్రారంభంతో మళ్లీ యాక్టివ్ కానున్న మాఫియా
- పిల్లలపై ఒక కన్నేసి ఉంచాల్సిందే
- వీలైనంత వరకూ సాయంత్రం వేళల్లో ఇంట్లో ఉండేలా చూడాలని సైకాలజిస్టుల సూచన



విశాఖపట్నం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): **ఎంవీపీ కాలనీకి చెందిన ఐటీ ఉద్యోగి కుమారుడు ఇంటర్ చదువుతున్నాడు. గడిచిన కొద్దినెలలుగా సెల్‌ఫోన్‌లో క్రికెట్ బెట్టింగ్ కాయడం అలవాటు చేసుకున్నాడు. మొదట తల్లిదండ్రులు ఖర్చుల కోసం ఇచ్చిన డబ్బులు కాసేవాడు. తరువాత స్నేహితులు, బంధువుల వద్ద అప్పులు చేశాడు. ఆఖరికి ఇంట్లో ఉన్న డబ్బులు, తన తండ్రికి తెలియకుండా ఆయన అకౌంట్‌లో ఉన్న డబ్బులు కూడా లాగేసి బెట్టింగ్ కాశాడు. విషయం తల్లిదండ్రులకు తెలిసేసరికి రూ.15 లక్షల వరకూ పోగొట్టాడు. అప్పటికే బెట్టింగ్ వ్యసనానికి బానిసైనట్టు గుర్తించిన తల్లిదండ్రులు కుమారుడికి కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నారు.**

నగరానికి చెందిన ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి స్నేహితుడి ద్వారా బెట్టింగ్ అలవాటైంది. మొదట్లో జీతం, ఆ తరువాత అప్పులు చేసి బెట్టింగ్ కాశాడు. భారీగా అప్పులు పెరిగిపోవడంతో విషయం కుటుంబ సభ్యులకు తెలిసింది. అప్పటికే తీవ్రమైన కుంగుబాటుకు గురైన కుమారుడి విషయం తెలుసుకున్న స్టీల్‌ప్లాంటులో పనిచేసే అతని తండ్రి కొన్ని ఆస్తులు అమ్మి అప్పులు తీర్చాడు. సదరు యువకుడు మొత్తం కోటి రూపాయలకుపైగా బెట్టింగ్‌లో నష్టపోయాడు.

గాజువాక ప్రాంతానికి చెందిన ఒక విద్యార్థి బెట్టింగ్‌కు అలవాటుపడ్డాడు. మొదట్లో తల్లిదండ్రులు ఖర్చులకు ఇచ్చిన డబ్బులు బెట్టింగ్ కాసేవాడు. ఆ తరువాత అప్పులు చేశాడు. విషయం తల్లిదండ్రులకు తెలిసేసరికి ఐదు లక్షల రూపాయల వరకూ బెట్టింగ్‌లో పోగొట్టుకున్నాడు.

క్రికెట్ బెట్టింగ్ జీవితాలను నాశనం చేస్తోంది. ఎంతోమంది ఈ ఊబిలోకి దిగి లక్షలాది రూపాయలు నష్టపోతున్నారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థి నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వరకూ అన్ని వర్గాలు, వయసులకు చెందినవారు ఈ బెట్టింగ్‌కు అలవాటుపడుతున్నారు. బెట్టింగ్ మాఫియాకు ఐపీఎల్ అతిపెద్ద పండుగని చెప్పాలి. ఒక్కో ఐపీఎల్ మ్యాచ్‌పై వేల కోట్ల రూపాయల బెట్టింగ్ జరుగుతుంది. అందుకే ఐపీఎల్ కోసం బెట్టింగ్ మాఫియా వేయి కళ్లతో ఎదురుచూస్తుంటుంది.

యాప్‌లతో సర్వనాశనం

బెట్టింగ్ రెండు రకాలుగా కాస్తుంటారు. బుకీల ద్వారా బెట్టింగ్ వేసేవాళ్లు ఒకరకం. బుకీ ఎక్కడో ఉంటాడు. అతనితో బెట్టింగ్ ... మిగతా 8వ పేజీలో

రోడ్డు విస్తరణ బాధితుల ఆందోళన



తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నిర్వాసితులు

మునగపాక, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి తహసీల్దార్ కార్యాలయం వద్ద అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు విస్తరణ నిర్వాసితులు శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వాసితులు ఆడారి శ్రీనివాసనాయుడు, ఎస్.బ్రహ్మాజీ తదితరులు మాట్లాడుతూ రోడ్డు విస్తరణ అవసరాన్ని గుర్తించి నష్టమైనా భూములు, భవనాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చామన్నారు. నష్ట పరిహారం నగదు రూపంలో ఇస్తామన్న హామీ మేరకు అంగీకరిస్తూ సంతకాలు చేశామన్నారు. ఇప్పుడు పరిహారం టీడీఆర్ విధానంలో చేస్తామని చెప్పడం తగదన్నారు. బ్రిడ్జిల నిర్మాణానికి ప్రాథమిక చర్యలు, హద్దుల పునఃపరిశీలన, నెలాఖరున శంకుస్థాప వంటివి తమను ఆందోళనకు గురిచేస్తున్నట్టు చెప్పారు. చెల్లింపులు నగదు రూపంలోనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ ఆది ఉమా మహేశ్వరరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితులు కాండ్రేగుల ధర్మ, మళ్ల గణేశ్, శరగడం గోవింద తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు ఆత్మస్థైర్యంతో మెలగాలి : ఎస్ఐ



జెడ్పీ పాఠశాలలో విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఐ సావిత్రి

ఎలమంచిలి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని పట్టణ ఎస్ఐ సావిత్రి సూచించారు. ఇక్కడి రైల్వే స్టేషన్ రోడ్డులోని జడ్పీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థినులకు శనివారం కరాటే కోచ్ క్కా వెంకట్రామన్‌తో కలిసి ఆత్మ రక్షణపై ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. విద్యార్థినులు అన్నివేళల్లో ధైర్యంగా ఉంటూ ముందుకు సాగాలన్నారు. ఆత్మరక్షణకు ఉపయోగపడే కరాటేలో శిక్షణ పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పట్టణ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బందికి ముగిసిన శిక్షణ

ఎలమంచిలి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలన్నఉద్దేశ్యంతో చేపట్టిన శిక్షణ తరగతులను అంగన్‌వాడీ కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలని సీడీపీవో ఇందిర సూచించారు శనివారం ఇక్కడ శిక్షణ ముగింపోత్సవానికి హాజరై పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రంజాన్ బీబీ, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' లక్ష్యం కావాలి

» ఇందుకు అనుగుణంగా గ్రామాలను తీర్చిదిద్దాలి » సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణ శిబిరంలో ఎమ్మెల్యే 'సుందరపు'

రాంబిల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర అందరి లక్ష్యం కావాలని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. సెజ్‌లోని లారస్ కంపెనీలో గల ట్రైనింగ్ హాల్‌లో అచ్యుతాపురం, మునగపాక మండలాల్లో గల పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులకు స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రపై ఏర్పాటైన శిక్షణ శిబిరంలో మాట్లాడారు. నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. గ్రామాల్లో పారిశుధ్య సమస్య పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారిణి శిరీషారాణి, డీపీఆర్‌సీ జిల్లా కో-ఆర్డినేటర్ ఇ.నాగలక్ష్మి, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం రూరల్ : మండలంలోని ఎం.జగన్నాథపురంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. గ్రామస్థులనుద్దేశించి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతకు అంతా అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని గణనీయంగా తగ్గించే ప్రయత్నాన్ని అందరూ చేయాలన్నారు. అనంతరం ఉపాధి హామీ పథకంలో భాగంగా వ్యవసాయ చెరువు నిర్మాణానికి ఆయన శంకుస్థాన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకరరావు, మాజీ సర్పంచ్ కరెడ్ల ప్రకాశ్, జనసేన నాయకులు మోటూరు శ్రీవేణి తదితరులు పాల్గొన్నారు.



సర్పంచులు, కార్యదర్శుల శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, చిత్రంలో డీపీవో శిరీషారాణి తదితరులు

రహదారి విస్తరణ పనులపై ఆర్‌అండ్‌బీ అధికారులతో సమీక్ష

అచ్యుతాపురం : అచ్యుతాపురం- అనకాపల్లి రోడ్డు విస్తరణ పనులకు ఈనెల 31న మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లకు అధికారులు, ప్రజా ప్రతినిధులు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా శంకుస్థాపన చేపట్టనున్న ప్రదేశంపై తొలుత రహదా రులు, భవనాల శాఖ అధికారులతో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ శనివారం ఇక్కడ సమీక్ష జరిపారు. అనంతరం అచ్యుతాపురం జంక్షన్‌కు సమీపంలో శంకుస్థాపనకు స్థలాన్ని నిర్ణయించారు. ఈ మేరకు సదరు ప్రదేశాన్ని ఎమ్మెల్యే పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. ఆర్‌అండ్‌బీ ఈఈ విద్యాసాగర్, డీఈ రాధాకృష్ణ, ఏఈ పద్మిని తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆరు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

అచ్యుతాపురం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఆరు గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. కొడకర్ల సెక్షన్ పరిధిలో గల విద్యుత్ లైన్ల మరమ్మతు కారణంగా కొండకర్ల జంక్షన్, ఎర్రవరం, ఉప్పవరం, మల్లవరం, ఎంజేపురం, నరేంద్రపురం గ్రామాలకు ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాలకు అంతరాయం కలగనుందన్నారు. వినియోగదారులంతా ఈ ఇందుకు సహకరించాల్సిందిగా ఆయన కోరారు

'పేదవర్గాల ప్రజల అభ్యున్నతికే పి-4 సర్వే'

ఎలమంచిలి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : పేదవర్గాల ప్రజలను ఆర్థిక, సామాజిక రంగాల్లో మరింత ముందుకు తీసుకువచ్చేందుకే ప్రభుత్వం పి-4 సర్వేను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్టు మునిసిపాలిటీలోని 12వ వార్డు జనసేన పార్టీ కోర్ కమిటీ ప్రతినిధి గుర్రాల శేఖర్ అన్నారు. శనివారం వార్డులోని మిలట్రీ కాలనీ సచివాలయం వద్ద, రామ్‌నగర్‌లోని సచివాలయం వద్ద సర్వేపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. పేదరికం లేని సమాజ స్థాపనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కొఠారు శ్రీనివాసరావు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పిల్లా త్రినాథ్, ఉదయ్, సంతోష్‌లతో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశ్రమల కాలుష్యం నుంచి గ్రామాలను కాపాడాలి

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు లోకనాథం

రాంబిల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఎస్ఈజెడ్‌లోని పరిశ్రమల నుంచి విడుదలవుతున్న కాలుష్యం, రసాయన వ్యర్థ జలాల బారినుంచి గ్రామాలను కాపాడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.లోకనాథం డిమాండ్ చేశారు. మండలంలోని లోవపాలెం, తోటవీధి, ఎరకన్నగారి ఇళ్లు, సీతపాలెం గ్రామాల్లో ప్రజా చైతన్యయాత్రలో భాగంగా శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో సమస్యలను అడిగి తెలుసుకుని మాట్లాడారు. ఎస్ఈజెడ్‌లోని పరిశ్రమల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా కాలుష్యాన్ని గ్రామాలపైకి వదులుతున్నట్టు ఆరోపించారు. పరిశ్రమలలోని రసాయన వ్యర్థ జలాలను రైతుల పంటపొలాలు, పంట కాలువల్లోకి వదులు తుండడం వల్ల పంటలు పాడవుతున్నాయన్నారు. ఈ కారణంగా ప్రజలు కాలుష్య కోరల్లో చిక్కుకుని అనారోగ్యానికి గురువుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భ జలాలు సైతం పాడవుతున్నాయన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి కాలుష్యం బారినుంచి గ్రామాలను కాపాడే ఏర్పాట్లు చేపట్టాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి జి.దేముడునాయుడు, నాయకులు ఎన్.నారాయణరావు, సిహెచ్.రామకృష్ణ, వై.రాము, డి.కాశియ్య, చెల్లూరి చిట్టిబాబు, సీహెచ్ ఇల్లాయుడు తదితరులు పాల్గొన్నారు.



సీతపాలెం వద్ద పంట కాలువను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు, గ్రామస్థులు

ఆస్తి పన్ను వసూళ్లకు ప్రత్యేక కౌంటరు

ఎలమంచిలి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను వసూళ్లకు సెలవు రోజుల్లో కూడా ప్రత్యేక కౌంటరు ఏర్పాటు చేసినట్టు మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్నులు, ఖాళీ స్థలం పన్నులు, నీటి చార్జీలు చెల్లించేందుకు ఈ నెలాఖరుతో గడువు ముగుస్తుందన్నారు. ఈ నెల 23వ తేదీ ఆదివారం, 30న ఉగాది, 31న రంజాన్ పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవులు అయినప్పటికీ పన్నులు చెల్లించేందుకు కార్యాలయంలో కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

కత్తితో దాడి చేసిన వ్యక్తి అరెస్టు

మునగపాక, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొల్లలపాలెంలో కత్తితో దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. ఈ నెల 20వ తేదీన గొల్లలపాలేనికి చెందిన చీర చిన్నారావును అదే గ్రామానికి చెందిన ప్రకృతి నూకరాజు కత్తితో దాడి చేశాడన్నారు. తప్పించుకు తిరుగుతున్న నూకరాజును శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు.

నేడు 'ప్రశాంతి'లో మెగా రక్తదాన శిబిరం

అచ్యుతాపురం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సినీ హీరో రామ్‌చరణ్ జన్మదినం సందరంగా ఆదివారం ఇక్కడి ప్రశాంతి విద్యా సంస్థల ఆవరణలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు అఖిల భారత రామ్ చరణ్ యువత అధ్యక్షుడు లాలం చందు తెలిపారు. రెడ్‌క్రాస్ సంస్థ సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. మెగా కుటుంబం అభిమానులతో పాటు యువత ఈ కార్యక్రమంలో పాల్గొని రక్తదానం చేయాల్సిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, ఉత్తరాంధ్ర జనసేన రాజకీయ వ్యవహారాల ముఖ్య ప్రతినిధి సతీష్ కుమార్ హాజరు కానున్నారన్నారు.

జల దినోత్సవంపై అవగాహన ర్యాలీ

రాంబిల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ జల దినోత్సవాన్ని హరిపురంలో గల లోటస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి హరిపురం, ఎస్ఈజెడ్ దిబ్బపాలెం కాలనీ, జంగాలపాలెంలలోని వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. మంచినీటి ప్రాముఖ్యత, పర్యావరణ పరిరక్షణపై నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం.నానాజీ, ఎం.సత్యనారాయణ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, సురేష్, గణపతి, భవానీ, వనజ తదితరులు పాల్గొన్నారు.

ఉపమాక వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు





ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు (ఇన్‌సెట్‌లో) అలంకరణలో స్వామివారు

నక్కపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక క్షేత్రం శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులతో కిటకిటలాడింది. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు కల్యాణ వేంకటేశ్వరుడిని తిలకించేందుకు తరలివచ్చారు. భక్తుల గోత్రనామాలతో ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా కొండపైన, కిందనున్న ఆలయాల్లో స్వామివారి నిజరూపానికి, ఉత్సవమూర్తులకు అర్చకులు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, భాగవతం సాయి గోపాలాచార్యులు, శ్రీనివాసాచార్యులు, రాజగోపాలాచార్యులు పూజలు చేశారు.

డీ పట్టాదారులకు న్యాయం చేయాలి



పనులు నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తున్న రైతులు, సీపీఎం నేతలు

నక్కపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డీఎల్‌పురం గ్రామం డీ పట్టా భూముల్లో జరుగుతున్న కారిడార్ సంబంధించి బాధితులకు పూర్తి స్థాయిలో పరిహారం ఇచ్చి న్యాయం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. శనివారం యంత్రాలతో పనిచేసే ప్రాంతానికి నిర్వాసిత రైతులతో కలిసి వెళ్లి ఆందోళన చేపట్టారు. 1967లో ఆనాటి ప్రభుత్వం పేద దళితులు, బీసీలకు 64 ఎకరాల డీపట్టా భూములు ఇచ్చిందన్నారు. గ్రామ సర్పంచి నిర్వాసిత రైతులకు సమాచారం లేకుండా ఈ భూముల్లో యంత్రాలతో పోలీసులను అడ్డంపెట్టుకుని పనులు చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమస్యను సీఐ కుమారస్వామికి అప్పలరాజు వివరించారు.కార్యక్రమంలో సర్పంచి కిల్లాడ కృష్ణతదితరులు పాల్గొన్నారు.

'రసాయన పరిశ్రమలకు భూముల సేకరణ తగదు'

నక్కపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బల్క్‌డ్రగ్ వంటి రసాయన పరిశ్రమల కోసం గ్రామాల్లో భూములను సేకరించడం తగదని జానకయ్యపేట గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేశారు. శనివారం ఎస్‌డీసీ అనిత, తహసీల్దార్ నర్సింహమూర్తి ఆధ్వర్యంలో భూముల సర్వేపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ, బల్క్‌డ్రగ్ వల్ల ప్రజల జీవనోపాధితోపాటు ఆరోగ్యాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు కురందాసు నూకరాజు, పెద్దలు కురందాసు సింహాచలం, అప్పలరాజు, దేవర సత్తిబాబు, నానాజీ, కృష్ణారావు, ఈగల వెంకటేశ్వరరావు తదితరులు భూముల సర్వేపై అభ్యంతరం తెలిపారు.

ఘనంగా కాలభైరవుని పూజ

నక్కపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రేబాక గూడుపమ్మ తల్లి శక్తి కేంద్రంలోని కాలభైరవుని మందిరం వద్ద అష్టమి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త గొట్టుముక్కల శ్రీహరిరాజు ఆధ్వర్యంలో స్వామివారికి జలాభిషేకం చేశారు. బెల్లం గారెలను నివేదన చేశారు. కాకినాడ జిల్లాకు చెందిన ప్రముఖ వేదపండితుడు, గురుస్వామి ప్రదీప్ శర్మ రేబాక గూడుపమ్మవారిని దర్శించుకున్నారు. పూజలు చేశారు. ఈ క్షేత్రంలోని అష్టాదశ శక్తిపీఠాల దేవతా విగ్రహాలను దర్శించుకున్నారు.అనంతరం ఆలయ ధర్మకర్త శ్రీహరిరాజు, గ్రామ పెద్ద సాదిరెడ్డి చిన వెంకన్న ప్రదీప్ శర్మను సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు.

'ఉపాధి'లో వేసవి అలవెన్స్ లేనట్టేనా?

» ఏటా కూలీలకు చెల్లింపు.. » ఈసారి ఇంతవరకు రాని ఉత్తర్వులు

» అభివృద్ధి పనులపై ప్రభావం



సుంకపూర్‌లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కోటవురట్ల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలు వేసవిలో ఎండలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటా రు. ఈ నేపథ్యంలో కూలీలకు అలవెన్సు ప్రకటించేవారు. ఈ ఏడాది ఇంత వరకు అలవెన్స్ మాటలేకపోవడంతో కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటా వేసవి నాలుగు నెలలు (మార్చి, ఏప్రిల్ మే, జూన్) కూలీలకు పనుల పరిమాణాన్ని తగ్గించి సాధారణంగా వేతనం చెల్లించేవారు.ఈ ఏడాది అలవెన్స్‌పైకేంద్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీకాకపోవడంతో లబోదిబోమంటున్నారు. ఉపాధికూలీలకు చెల్లించే రోజువారీ వేతనాన్ని రూ.300కు పెంచడంతో వేసవి అలవెన్సుకూడా అందులోనే అంటుందని అధికారులు చెబుతుండటం విశేషం.

13 కుటుంబాలకు.. 2,300మంది మా త్రమే పనుల్లోకి...

మండలంలో 25 గ్రామ పంచాయతీల్లో 400 శ్రమశక్తి సంఘాలున్నాయి. 13 వేల కుటుంబాలు జాబ్‌కార్డులు కలిగి ఉన్నారు. కానీ, కేవలం ప్రస్తుతం 2,300మంది మా త్రమే పనుల్లోకి వస్తున్నారు. ఇప్పటికే 700 కుటుంబాలు 100 రోజులు పనిదినాలు పూర్తిచేసుకున్నారు. వేసవిలో పనిచేస్తే గతంలో ప్రోత్సాహకంగా అలవెన్స్ ఉండేది. ఫిబ్రవరినెల నుంచి కూలీలకు చేసిన పని బట్టి అదనంగా 20 శాతం, మార్చిలో 25శాతం, ఏప్రిల్, మేనెలల్లో 30శాతం, జూన్‌లో 20శాతం వరకు పనులు పరిమాణం తగ్గించి 100 శాతం పనికి వేతనాన్ని అందించేవారు. వేసవిలో నేలగట్టిగా ఉండటంతో పని తక్కువగా జరిగినా అలవెన్సుతో కలిపి ఇస్తే.. కూలిగిట్టుబాటయ్యేది. గత ఏడాది పోలిస్తే కూలీలు హాజరు శాతం ఈసారి బాగా తగ్గిపోయింది. సాధారణంగా వేసవిలో పనులు గిట్టు బాటుకాక, సకాలంలో వేతనాల రాక చాలా మేర కూలీ ఉదారంగా ఉంటున్నారు. వ్యవసాయ పనులకు వెళ్తే రోజుకు రూ. 400నుంచి రూ.500 చొప్పున వస్తున్నట్టు కూలీలు చెబుతున్నారు. దీంతో ప్రస్తుతం వ్యవసాయ పనులు లేనివారు మాత్రమే ఉపాధి పనులకు వస్తున్నారు. 50మంది కూలీలను పనులకు తీసుకువస్తే అందుకు ప్రతికూలీకి రూ1.50 చొప్పున అదనపువేతనం ఇవ్వనున్నారు.

ఉత్తర్వులు రాలేదు..



ఏటా కూలీలకు అలవెన్సు జనవరిలోనే అధికారులు ప్రకటించేవారు. ఈ సారి ప్రతికూలీకి రూ. 275 నుంచి రూ. 300కు తగ్గకుండా కల్పించాలని కేంద్రం ఆదేశాలు జారీచేసింది. ఇందులోనే వేసవి అలవెన్సుఉంటుందనిచెబుతున్నారు. మార్చి మూడు వారాలు దాటిపోయింది. ఈ ఏడాది కూలీలకు అలవెన్సు లేనట్టేనని అధికారులు చెబుతున్నారు.

-నాగరాజు, ఉపాధిహామీ ఏపీవో, కోటవురట్ల మండలం

సబ్ ట్రెజరీని నక్కపల్లికి తరలించవద్దు



వినతిపత్రమిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు, పెన్షనర్లు

పాయకరావుపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : పాయకరావుపేటలోని సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని నక్కపల్లి తరలించవద్దని పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, పెన్షనర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం ఈ విషయాన్ని హోం మంత్రి వంగలపూడి అనిత దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతూ టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబుకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ పెన్షనర్లు, సంఘాల నాయకులు రహీమ్, పి.శ్రీనివాసరావు, గణేష్, నూకరాజు, ప్రసన్నకుమార్, గెడ్డం సత్యనారాయణ, కట్టా శ్రీరామచంద్రమూర్తి, అడపా ప్రకాష్, హరికృష్ణ, వీరభద్రరావు, జోగిరాజు, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

సహకార సొసైటీ పక్కనున్న స్థలంపై వివాదం



మాట్లాడుతున్న టీడీపీనేత జానకీశ్రీనివాసరావు

కోటవురట్ల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక సహకార సంఘం ఎదురుగా ఉన్న సీతారామరాజునగర్ కాలనీలో సొసైటీ క్వార్టర్స్ పక్కనగల పదిసెంట్లు స్థలం వివాదాస్పదంగా మారింది. శనివారం సహకార సంఘ సర్వ సభ్య సమావేశం కిమిగి జగన్నాథం అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు జానకీ శ్రీనివాసరావు మాట్లాడుతూ సీతారామరాజునగర్‌కాలనీ సొసైటీ క్వార్టర్ పక్కన ఉన్న స్థలం ఎవరిదని ప్రశ్నించారు. గతంలో సొసైటీ కార్యదర్శిగా పనిచేసినప్పుడు రామూర్తి పం తులు 2004లో తంగేడు మాజీ సర్పంచి కోరుప్రోలు రాజులకు విక్రయించినట్టు ఆరోపించారు. ఈ విషయంపై మాజీ ఎమ్మెల్సీ డీ వీ సూర్యనారాయణరాజు మాట్లాడుతూ రామూర్తిపంతులు అమ్మకం చేసిన స్థ లం ఎలా వచ్చిందో రిజిస్ట్రేషన్ ఆఫీసులో ఈసీ లేదా సొసైటీ రికార్డులను పరిశీలిస్తే స్పష్టత వస్తుందని ఆయన అధికారులకు సూచించారు. అనంతరం పి. సూర్యారావుమాట్లాడుతూ సొసైటీ లో ఎప్పటి నుంచో ఉన్నషేర్ క్యాపిటల్ అమౌంట్ రూ. 48లక్షలు సొసైటీకి అభివృద్ధికి లేదా రైతులకుపంచాలని డిమాండ్‌చేశారు. రుణాల రికవరీలో సిబ్బంది నిర్లక్ష్యంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు.సొసైటీ ద్వారా ఎరువులు, మందులు, విక్రయించాలని తీర్మానించారు. ఈ సమావేశానికి సాగిసీతారామరాజు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలంకాశీనాయుడు, డైరెక్టర్లు వేచలపుజనార్దన్, సుంకర్ బాబ్జీ, చిటికెల సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ఎస్. రాయవరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత జన్మదిన వేడుకలు పురస్కరించుకుని ధర్మవరం అగ్రహారంలో అచ్యుత్ హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్న ఉచిత కంటి వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలను శనివారం టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత గుర్రం రామకృష్ణ, ఉప సర్పంచి కలిగట్ల మాణిక్యం, పాల సంఘం అధ్యక్షుడు గేదెల నాయుడు పాల్గొన్నారు

నేడు విద్యుత్ సరఫరా అంతరాయం

ఎస్. రాయవరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలోని ఎస్ రాయవరం టౌన్, వాకపాడు గ్రామాల్లో ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు అనకాపల్లి ఏపీఈపీడీసీఎల్ ఈఈ రాజశేఖర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా ఈ అంతరాయం ఉంటుందన్నారు.

భూ వివాదంలో న్యాయం చేయండి

» శతాధిక వృద్ధురాలు సీతయమ్మ



మంచంపట్టిన పదిలం సీతయమ్మ

పాయకరావుపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కోర్టు వివాదంలో ఉన్న తన భూమికి సంబంధించి తీర్పు వచ్చేంత వరకు డిస్ప్యూట్ రిజిస్టర్‌లో నమోదుచేసి న్యాయం చేయాలని, లేకుంటే నిరాహార దీక్ష చేపడతానని మండలంలోని పీఎల్ పురం గ్రామానికి చెందిన పదిలం సీతయమ్మ అనే శతాధిక వృద్ధురాలు హెచ్చరించారు. శనివారం ఆమె విలేకరుల ఎదుట తమ ఆవేదనను వెల్లడించారు. తన పేరుపై, తన కుటుంబ సభ్యుల పేరుమీద మండలంలో నామవరం, పీఎల్.పురం గ్రామాల్లో ఉన్న 10.70 ఎకరాలకు సంబంధించి పదిలం వెంకటేశ్వరరావు అనే వ్యక్తి తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించిన విషయమై కోర్టులో కేసు నడుస్తున్నందన్నారు. దీనిపై జేసీ ఆదేశాల మేరకు డిస్ప్యూట్ రిజిస్టర్‌లో నమోదుచేశారన్నారు. అయితే గతేడాది అప్పటి తహసీల్దారు తప్పుడు రికార్డులు సృష్టించిన వెంకటేశ్వరరావుపేరున 1బీ, ఎల్‌పీ జారీ చేసినట్టు ఆమె ఆరోపించారు. దీనిపై ఇటీవల గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కి ఫిర్యాదు చేయడంతో ఆయన ఆదేశాల మేరకు ప్రస్తుత తహసీల్దారు విచారణ చేపట్టి నామ మా త్రంగా నివేదిక అందించినట్టు ఆమె విమర్శించారు. ఇకనైనా కలెక్టర్ స్పందించి తనకున్యాయం చేయాలని కోరారు.

హైస్కూళ్ల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఉప విద్యాశాఖాధికారి

నక్కపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి, పెదబోదిగల్లం హైస్కూళ్లను శనివారం జిల్లా ఉప విద్యాశాఖాధికారి పి.అప్పారావు తనిఖీ చేశారు. 6 నుంచి 9 తరగతులు చదువుతున్న విద్యార్థులు ప్రగతి, పఠనా సామర్థ్యంపై ఆయన ఆరా తీశారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్స్

నక్కపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): హోం మంత్రి వంగలపూడి అనిత బర్త్ డే నేపథ్యంలో కొన్ని రోజులుగా స్థానిక హెటిరో మైదానంలో నిర్వహిస్తున్న మెగా క్రికెట్ టోర్నీ ముగింపు దశకు చేరుకుంది. నియోజకవర్గం పరిధిలో 48 జట్లు , 750 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఫైనల్ పోరుకు పాయకరావుపేట క్రికెట్ లవర్స్ టీం, నక్కపల్లి మండలం నూకతాత క్రికెట్ జట్లు ఎంపికయ్యాయి. ఆదివారం ఈ రెండు జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరుగుతుందని నిర్వాహకులు చెప్పారు.

నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య

జాతరకు సహకారం అందించండి

- విశాఖ జిల్లా కలెక్టర్‌ను కోరిన ఆలయ ఈవో, ప్రత్యేక అధికారిణి
- రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రకటించినట్టు వెల్లడి



కలెక్టర్‌ను సత్కరిస్తున్న ఈవో, చిత్రంలో ఉత్సవ ప్రత్యేకాధికారిణి

అనకాపల్లి టౌన్, మార్చి22 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరకు జీవీఎంసీ ద్వారా సహకారం అందించాలి విశాఖ జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌ను ఆలయ ఈవో వెంపలి రాంబాబు, ఉత్సవ ప్రత్యేక అధికారిణి శోభారాణి కోరారు. ఈ మేరకు శనివారం విశాఖపట్నంలో ఆయనను కలిసి వినతి పత్రం అందజే శారు. ఈ ఏడాది నూకాంబిక అమ్మవారి జాతరను రాష్ట్ర పండుగగా ప్రభు త్వం ప్రకటించిన నేపథ్యంలో జీవీఎంసీ ద్వారా పూర్తి సహాయ సహకారాలు అందించాలని విన్నవించి, సత్కరించారు. దీనిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని ఈవో రాంబాబు ఇక్కడి విలేకరులకు తెలిపారు.

జాతర ఏర్పాట్లు పరిశీలన

ఇదిలావుంటే, నూకాంబిక ఆలయంలో జాతర ఏర్పాట్లను ఈవో వెంపలి రాంబాబుతో కలిసి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, దాడి జయవీర్ శనివారం సాయంత్రం పరిశీలించారు. ఈ వేడకకు రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఉత్సవ ప్రత్యేకాధికారిణి శోభారాణి, పార్టీ నాయకులు కొణతాల భాస్కరరావు, బొడ్డేడ శంకరరావు, కాండ్రేగుల కృష్ణఅప్పారావు, విల్లూరి రాము, శిలపరశెట్టి బాబి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై నెహ్రూచౌక్‌లో అవగాహన



విద్యార్థులతో కలిసి ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శేఖరం

అనకాపల్లి టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి నెహ్రూచౌక్‌లో శనివారం విద్యార్థులతో కలిసి ట్రాఫిక్ పోలీస్ అధికారులు ద్విచక్ర వాహనచోదకులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలపై వెళ్లేటప్పుడు ప్రమాదం జరిగితే పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ వివరించారు. వాహన రికార్డులు లేకుండా ప్రయాణం చేయడం తగదన్నారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడిపితే లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. స్కూల్ బస్సులు నిబంధనల ప్రకారం ఫిట్‌నెస్‌గా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ శేఖరం, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని వినతి



ఆర్డీవో షేక్ ఆయీషాకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అనకాపల్లి టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : వేసవి తీవ్రత దృష్ట్యా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని అఖిల పక్ష నాయకులు శనివారం ఆర్డీవో షేక్ ఆయీషాకు వినతి పత్రం అందజేశారు. గ్రామాల్లో మూలకు చేరిన రక్షిత మంచినీటి పథకాల బోర్లు, పైప్ లైన్లు తదితరాలకు మరమ్మతులు చేపట్టాల్సిందిగా కోరారు. తాగునీటి వృథాను అరికట్టాలన్నారు. అవసరమైన చోట్ల నూతన బోర్లను ఏర్పాటు చేయాలని, ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి సూదికొండ మాణిక్యాలరావు, రైతు సంఘం నాయకుడు కోరిబిల్లి శంకరరావు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధన సమితి కన్వీనర్ కోన లక్ష్మణ, రిటైర్డు ఆర్టీసీ ఉద్యోగుల సంఘం నాయకుడు విత్తనాల పోతురాజు, మత్సుర్తి సూరిబాబు తదతరులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వేపై మహిళలకు అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న వార్డు టీడీపీ ఇన్‌చార్జి నీలబాబు

అనకాపల్లి టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 84వ వార్డు 10, 11, 12 సచివాలయాల పరిధిలోని మహిళలకు సమగ్ర సర్వేపై ఆ వార్డు టీడీపీ ఇన్‌చార్జి మాదంశెట్టి నీలబాబు శనివారం అవగాహన కల్పించారు. సమగ్ర సర్వే సిబ్బంది ఇంటింటికీ వచ్చినప్పుడు చాలా మంది వారు వేసిన ప్రశ్నలకు సరిగా సమాధానం చెప్పడం లేదన్నారు. ప్రభుత్వ పథకాలు పోతాయేమోననే అనుమానాలతో వివరాలు చెప్పకపోవడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీ ప్రకారం అన్ని సమకూర్చుతుందని వివరించారు. గత వైసీపీ పాలనలో విధించిన ఆరు నిబంధనలను ప్రభుత్వం తొలగించిందన్నారు. సచివాలయ సిబ్బంది వచ్చినప్పుడు వారు అడిగిన వివరాలు సంపూర్ణంగా తెలియజేయాలని సూచించారు.. ఈ అవగాహన సదస్సులో సచివాలయాల అడ్మిన్‌లు మంగ అప్పారావు, బి.శిరీషా, ఉదయ్‌భాస్కర్, టీడీపీ నాయకులు కోట్ని రామకృష్ణ, కుప్పిలి జగన్, తలారి లక్ష్మీప్రసాద్, పిళ్లా తారకేసు, కోట్ని రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఫిర్యాదుల పరిష్కారానికి కాల పరిమితి

- సేవా లోపాలపై ప్రశ్నించండి
- సీజీఆర్ఎఫ్ చైర్మన్ బి.సత్యనారాయణ



విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సత్యనారాయణ

అనకాపల్లి టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఫిర్యాదులు కాల పరిమితిలోగా పరిష్కారం కాకపోతే వినియోగదారులకు విద్యుత్‌శాఖ పరిహారం చెల్లించాల్సి ఉంటుందని విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) చైర్‌పర్సన్ బి.సత్యనారాయణ తెలిపారు. గౌరీ గ్రంథాలయంలో నెహ్రూయువ కేంద్రం, కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్, అనకాపల్లి మండల వినియోగదారుల మండలి సహకారంతో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) 'ప్రయోజనాలు' అంశంపై శనివారం నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. విద్యుత్ సేవల సిటిజన్ చార్టర్‌ను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి సేవా లోపం ఉన్నా సీజీఆర్ఎఫ్‌కు వ్యక్తిగతంగా, వాట్సాప్ నంబర్ 94936 81912కు, chrper@apepsternpower. comకు ఈ- మెయిల్, పోస్టు ద్వారా లేదా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫిర్యాదు చేయడానికి ఎటువంటి రుసుము లేదని, న్యాయవాది అక్కరలేదన్నారు. సమస్యలున్న వినియోగదారులు సమస్య ఉత్పన్నమైన నాటి నుంచి రెండేళ్లలోపు నిర్దేశిత దరఖాస్తులో రాతపూర్వకంగా సీజీఆర్ఎఫ్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. 60 రోజుల్లోపు తీర్పు వెలువడుతుందన్నారు. అయితే దీనికి ముందు 1912కు, క్షేత్రస్థాయి విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసి తిరుగు రశీదులు పొందాలని ఆయన సూచించారు. సదస్సులో స్వీకరించిన ఫిర్యాదులను పరిశీలించి ఇరువర్గాలను విచారిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులారిటీ కమిషన్ రాష్ట్ర సలహా కమిటీ సభ్యులు కాండ్రేగుల వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో సీజీఆర్ఎఫ్ సభ్యులు షేక్ బాబర్, వి.మురళీకృష్ణ, నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ గొర్లి మహేశ్వరరావు, సమాచార హక్కు ఉద్యమకర్తలు కె.శ్రీరామకిశోర్, ఈపీడీసీఎల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.వి.రామరెడ్డి, గౌరీ గ్రంథాలయ అధ్యక్షులు డి.నూకఅప్పారావు, పి.శివశంకర్, శరగడం శ్రీనువాసరావు, కాండ్రేగుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల వెల్లువ

వ్యక్తిగత విద్యుత్ కనెక్షన్లు, బహుళ అంతస్తుల్లోని ప్యానల్ బోర్డుల ఏర్పాటు, కొత్త విద్యుత్ సర్వీస్ కనెక్షన్ల దరఖాస్తులను కారణాలను తెలియజేయకుండా తిరస్కరించడం, విద్యుత్ బిల్లింగ్‌లో లోపాలు, కేటగిరీ మార్పు, సరఫరా పునరుద్ధరణ, కొత్త విద్యుత్ కనెక్షన్ల జారీలో జాప్యం, విద్యుత్ ఓల్టేజి హెచ్చు తగ్గులు, మీటర్ల సేవల్లో లోపాలు తదితర విద్యుత్ సమస్యలపై లిఖిత పూర్వకంగా విద్యుత్ వినియోగదారులు ఫిర్యాదులు చేశారు.

'సింహాద్రి'

మొదటి యూనిట్‌లో ఉత్పత్తి పునరుద్ధరణ

పరవాడ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ)లోని 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మొదటి యూనిట్‌లో శనివారం రాత్రి ఉత్పత్తిని పునరుద్ధరించారు. ఇదే యూనిట్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో శుక్రవారం అర్ధాంతరంగా ఉత్పత్తి నిలిచిపోయిన సంగతి తెలిసిందే. అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టి యూనిట్‌లో ఉత్పత్తిని పునరుద్ధరించారు. కాగా 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండో యూనిట్‌కు సంబంధించి బాయిలర్ ట్యూబ్‌లకు రంధ్రాలు ఏర్పడి శుక్రవారం ఉత్పత్తి నిలిచిపోయిన సంగతి తెలిసిందే. ఈ యూనిట్‌లో ఇంకా మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. మిగతా మూడు, నాలుగు యూనిట్‌ల్లో ఉత్పత్తి పూర్తిస్థాయిలో జరుగుతుందని అధికారులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

పరవాడ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాంకీ ల్యాండ్‌ఫిల్ సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. దీనికి సంబంధించి పరవాడ సీఐ ఆర్. మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఫార్మాసిటీలోని ఘన వ్యర్థాలను నిల్వ చేసే రాంకీ ల్యాండ్‌ఫిల్ సమీపంలో శనివారం ఉదయం సుమారు 55 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి తీవ్ర గాయాలపాలై పడి ఉన్నాడు. ఉదయం పది గంటల సమయంలో రాంకీ సిబ్బంది ఈ విషయాన్ని గమనించి పరవాడ పోలీసులకు సమాచారమిచ్చారు. చికిత్స నిమిత్తం వెంటనే అతనిని అంబులెన్స్‌లో విశాఖ కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. అతని ఒంటిపై తెలుపురంగు బనియన్, మెరూన్ కలర్ షర్టు ఉంది. మృతుని సంబంధీకులైవరైనా ఉంటే పరవాడ పోలీస్‌స్టేషన్‌లో సంప్రతించాలని సీఐ కోరారు. స్థానిక వీఆర్వో వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు దుర్గమాంబ ఆలయంలో వేడుక



పరవాడ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఈ.బోనంగి పంచాయతీ బొద్దపువానిపాలెంలో దుర్గమాంబ అమ్మ వారి ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభం కానున్నాయన్నారు. సాయంత్రం ఆరు గంటల నుంచి ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

25న వెంకన్న ఆలయంలో శ్రవణా నక్షత్ర పూజలు

పరవాడ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఈ.బోనంగి పునరావాస కాలనీ వద్ద గల కొండపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 25న శ్రవణా నక్షత్ర పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ బుగిడి రామగోవిందరావు తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష పూజలు నిర్వహిస్తామన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

క్షయ వ్యాధి నివారణకు అంతా కృషి చేయాలి



తుమ్మపాలలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తుమ్మపాల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : క్షయ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ చేయాలని తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ నజరత్ షమీమ్ అన్నారు. ఈ నెల 24న జాతీయ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా శనివారం తుమ్మపాలలో క్షయ వ్యాధిపై ముందస్తుగా అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయవ్యాధి లక్షణాలను ముందుగానే గుర్తిస్తే సులభంగా నివారించవచ్చునన్నారు. ఈ వ్యాధికి సంబంధించి మందులు ఉన్నాయన్నారు. వ్యాధి లక్షణాలు గుర్తించిన వారు తక్షణమే వైద్యాధికారులను సంప్రదించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో క్షయ వ్యాధి నివారణ ప్రాజెక్టు సూపర్‌వైజర్ పెంటయ్య, పీహెచ్‌సీ సిబ్బంది డి.శారదా, బి. మంగమ్మ, ఎం.మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంపతిపురం గృహ సముదాయాల్లో మౌలిక వసతుల కోసం ఆందోళన

- వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టించుకోలేదని లబ్ధిదారులు ఆవేదన
- కలెక్టర్ స్పందించి సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి



కనీస సౌకర్యాలు కల్పించాలని నినాదాలు చేస్తున్న కాలనీ వాసులు

కొత్తూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం కొత్తూరు పంచాయతీ పరిధి సంపతిపురంలో నిర్మించిన జగనన్న ఇళ్ల కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ పలువురు లబ్ధిదారులు శనివారం నినాదాలు చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు బొడ్డేడ శివాజీ, కె.సంతోషి, వసుంధర, ఎం.మణి, చెక్కా రాము తదితరులు మాట్లాడుతూ సంపతిపురం గ్రామ సర్వే నంబరు 2/2లో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇళ్ల నిర్మాణానికి స్థలాలను కేటాయించారన్నారు. నాటి నుంచి ఇళ్ల నిర్మాణానికి అవసరమైన పూర్తి సహకారం ప్రభుత్వం నుంచి అందకపోయినా అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకున్నామన్నారు. కానీ మౌలిక వసతులు పూర్తి స్థాయిలో కల్పించలేదని వాపోయారు. తాగునీరు, రోడ్ల నిర్మాణం, విద్యుద్దీపాలు వంటివి చేపట్టకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. ఈ కాలనీలో 355 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించగా, రెండు వందల మంది ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేశారన్నారు. మౌలిక వసులు లేకపోడంతో కేవలం ప్రస్తుతం 70 కుటుంబాలు మాత్రమే ఇక్కడ నివాసముంటున్నట్టు చెప్పారు. ఇక్కడి సమస్యలను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను కలిసి విన్నవించామన్నారు. ప్రతి నెలా రేషన్ సరకులు అందించే వ్యాను కూడా తమ కాలనీలోకి రావడం లేదన్నారు. తమ కాలనీని తక్షణే జిల్లా కలెక్టర్ సందర్శించి అవసరమైన సౌకర్యాలు కల్పించాల్సిందిగా వాంతా కోరారు.

స్పాట్ వాల్యుయేషన్‌పై డీఈవోకు వినతి



డీఈవోకు వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

అనకాపల్లి టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షా పత్రాల స్పాట్ వాల్యుయేషన్‌కు సంబంధించిన సమస్యలపై యూటీఎఫ్ ప్రతినిధులు శనివారం డీఈవో గిడ్డి అప్పారావునాయుడుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి మాట్లాడుతూ పదో తరగతి బోధించడంలో మూడేళ్ల కంటే ఎక్కువ అనుభవం కలిగి, పదో తరగతి మూల్యాంకనానికి సమ్మతి తెలిపే ఉపాధ్యాయులను స్పాట్ వాల్యుయేషన్‌లో నియమించాలని కోరారు. అలాగే స్పాట్ వాల్యుయేషన్‌కు ఆయా సబ్జెక్టుల్లో ఎంతమంది ఉపాధ్యాయులు అవసరమవుతారో, ఆ సీనియార్టీ జాబితాను ముందుగా తెలియజేయాలన్నారు. స్పాట్ వాల్యుయేషన్ సెంటర్‌లో తగిన వసతులు కల్పించాలని, 58 ఏళ్ల పైబడిన వయస్సు గల ఉపాధ్యాయులకు స్పాట్ వాల్యుయేషన్ నుంచి వారి కోరితే మినహాయింపు ఇవ్వాలని పేర్కొన్నారు. అలాగే దీర్ఘకాలిక వాధితో బాధపడుతున్న ఉపాధ్యాయులకు, 50 శాతం అంగవైకల్యం కలిగిన ఉపాధ్యాయులకు, గర్భిణులకు మినహాయింపు ఇవ్వాలని ని విన్నవించారు. దీనిపై డీఈవో స్పందించి తగు చర్యలు చేపడతామని చెప్పారని చినబ్బాయి తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాత్సావాయి శ్రీలక్ష్మి, మండల శాఖ ప్రధాన కార్యదర్శి నాతవరపు సతీష్, మునగపాక మండల నాయకులు ఆశ, సీనియర్ నాయకులు రవి, కరుణజ్యోతి పాల్గొన్నారు.

తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ కెప్టెన్‌ల సేవలు గుర్తించాలి

- కనీస వేతనాలు అమలు చేయాలని విజ్ఞప్తి



డిమాండ్ల పత్రాన్ని చూపుతున్న తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ కెప్టెన్‌లు

అనకాపల్లి టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ 102లో పనిచేస్తున్న కెప్టెన్‌లకు కనీస వేతనాలు అమలు చేయాలని వారంతా కోరారు. సదరు ఎంప్లాయీస్ యూనియన్ అనకాపల్లి జిల్లా సమావేశం శనివారం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కెప్టెన్‌లుగా గత తొమ్మిదేళ్ల నుంచి అతి తక్కువ వేతనం రూ. 7,870తో పనిచేస్తున్నామన్నారు. ఒకపక్క నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగినా తమకు వేతనాలు పెంచకపోవడం దారుణమన్నారు. ఈ నెల 31తో కాంట్రాక్ట్ ముగుస్తున్నందున స్పందించి తమకు నెలకు రూ. 18,500ల జీతాలు ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.దేవీప్రసాద్, సీఐటీయూ జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు, యూనియన్ నాయకులు పి.కృష్ణ, డి.శ్రీనివాసరావు, ఎ.నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యాచకుడి మృతి

కొత్తూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పిసినికాడ జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యాచకుడు మృతి చెందాడు. దీనికి సంబంధించి అనకాపల్లి రూరల్ ఎస్ఐ జి.రవికుమార్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ఎలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం అదే సమయంలో రోడ్డు దాటుతున్న ఓ యాచకుడిని ఢీకొంది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెం దాడు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

లంకెలపాలెం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 77, 79 వార్డుల పరిధిలో ఆదివారం నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని నీటి సరఫరా విభాగం ఏఈ పి.కేదార్‌నాథ్ తెలిపారు. ఏలేరు కాలువ వద్ద ప్రధాన పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టనున్న కారణంగా లంకెలపాలెం, పరవాడ హౌసింగ్ కాలనీ, దేశపాత్రునిపాలెం, దేవాడ, అప్పికొండ, మదీనాబాగ్ ప్రాంతాల్లో నీటి సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. ఆయా ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు.

నేడు సాయినగర్‌లో ఉచిత వైద్య శిబిరం

అనకాపల్లి టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి గవరపాలెం సాయినగర్‌లోని షిర్డీసాయిబాబా ఆలయం వద్ద నోబెల్ చారిటీస్, భారత వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్టు డాక్టర్ శరగడం నూకరాజు తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి జరిగే ఈ శిబిరంలో రూ.మూడు వేలు విలువ చేసే ఎముకల దృఢత్వ పరీక్షను నిర్వహిస్తామన్నారు. విశాఖకు చెందిన ఆరోగ్య ఆర్థోపెడిక్ ఆసుపత్రి సహకారంతో జరగనున్న ఈ శిబిరంలో ఎముకల వైద్యనిపుణులు డాక్టర్ సుధీర్ సేవలందిస్తారన్నారు.

సమస్యల పరిష్కారానికే సమన్వయ కమిటీ సమావేశాలు

- ప్రత్యేకాధికారిణి లక్ష్మీ సుభాషిణి



ప్రజల సమస్యలు వింటున్న అధికారులు

కశింకోట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రతి శనివారం నిర్వహించే మండల సమన్వయ కమిటీ సమావేశం దృష్టికి వచ్చే సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు మండల ప్రత్యేకాధికారిణి లక్ష్మీ సుభాషిణి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజల నుంచి అందే ఫిర్యాదులను ఆయా శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి పరిష్కరించాలని సూచించారు. అనంతరం పలువురు సమస్యలను విన్నవించారు. ఎంపీడీవీ వి.వి.రవికుమార్, డిప్యూటీ తహశీల్దార్ కుమారస్వామి, ఎస్ఐ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం తాళ్లపాలెంలో వారపు సంత పరిసర ప్రాంతాలను, గొబ్బూరులో సంపద కేంద్రాన్ని ప్రత్యేకాధికారిణి బృందం పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

'చిన్నారుల సమగ్ర అభివృద్ధికే అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ'



కశింకోట శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న సీడీపీవో ప్రభావతి

కశింకోట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం అందించడంతో పాటు పిల్లలకు ఆట పాటల ద్వారా నాణ్యమైన విద్యనందించాలని ఐసీడీఎస్ సీడీపీవో పి. ప్రభావతి అన్నారు. బయ్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కశింకోట, అనకాపల్లి మండలాల్లో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలకు ఏర్పాటైన శిక్షణ శిబిరం శనివారం ముగిసిన సందర్భంగా మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి బాలలను ఆరోగ్యకరంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ఈ శిక్షణ శిబిరం నిర్వహించినట్టు చెప్పారు. ఏసీడీపీవో టి.శశికళ, సూపర్‌వైజర్లు ఎం.రూన్సీరాణి, సిహెచ్.వంశీప్రియ, జి.కె.లక్ష్మి, జి.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

సబ్బవరం : ఇక్కడి ఐసీడీఎస్ కార్యాలయంలో మూడు రోజులుగా అంగన్‌వాడీలకు జరుగుతున్న శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత మాట్లాడుతూ ప్రభుత్వం చిన్నారుల సమగ్ర అభివృద్ధి కోసం అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఎంజే రాజేంద్రబాబు, వెలుగు ఏపీఎం శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు ఆర్.పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.



సబ్బవరంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ స్వర్ణలత


పెదలబుడులో ఫారం ఫాండ్‌లకు శంకుస్థాపన చేస్తున్న దొన్నుదొర


జి. మాడుగులలో నీటికుంట పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ


రాయిగెడ్డలో నీటికుంటల తవ్వకం పనులు ప్రారంభించిన గిడ్డి ఈశ్వరి

భూగర్భ జలాలు పెంపొందించడమే ప్రభుత్వ ధ్యేయం

» విజయనగరం రీజియన్ ఆర్టీసీ చైర్మన్ దొన్నుదొర

అరకులోయ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నీటికుంటల వల్ల భూగర్భ జలాలు పెరిగి సాగునీటి కొరత తీరుతుందని విజయనగరం రీజియన్ ఆర్టీసీ చైర్మన్, టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర అన్నారు.శనివారం పెదలబుడు గ్రామంలో సర్పంచ్ దాసుబాబు ఆధ్వర్యంలో నీటికుంటలు తవ్వకాల పనులను దొన్నుదొర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సాగునీటి అవసరాలు తీర్చేందుకు ఈ పనులకు అవకాశం కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు శెట్టి బాబురావు, ఎంపీటీసీ సభ్యుడు శత్రుఘ్న, టీడీపీ గ్రామ అధ్యక్షుడు అర్జున్, నేతలు గెన్ను, సోమరాజు,లక్ష్మణరావు, ఏపీవో, గ్రామస్థులు పాల్గొన్నారు.

కొయ్యూరు: భూగర్భ జలాలను సంరక్షించాలనే ధ్యేయంతోనే ప్రభుత్వం ఉపాధి పథకంలో చిన్న చెరువుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నట్టు ఏపీవో అప్పలరాజు సూచించారు. జాతీయ జల దినోత్సవం పురస్కరించుకుని మండలంలో ఏర్పాటు చేసిన ఫారం పాండ్ (చెరువు)లను 33 పంచాయతీలలో శనివారం ప్రారంభించారు. రాజేంద్రపాలెంలో ఏపీవో అప్పలరాజు ఆధ్వర్యంలో వైస్ ఎంపీపీ అంబటి నూకాలమ్మ, సర్పంచి సింహాచలం చెరువును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూ టమి నేతలు లక్ష్మణరావు, బుజ్జిబాబు తో పాటు పథకం టీఏలు, ఎఫ్ఏలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: ప్రజలు భవిష్యత్తు అవసరాల కోసం జలవనరులను కాపాడుకోవాలని స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో విశాఖ నవనిర్మాణ సమితి ప్రపంచ నీటి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత పోస్టర్లను ఆవిష్కరించారు. అలాగే చౌడుపల్లిలో ఫారం పాండ్స్‌ను ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు ప్రారంభించారు. ఆర్ఏఆర్ఎస్‌లో శాస్త్రవేత్తలు నీటి ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, సర్పంచులు దురియా పుష్పలత, సాగిన వరలక్ష్మి, ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు, సీడీపీవో జీవీ రమణ, ఆర్‌డబ్ల్యూస్ ఏఈఈ జి. స్వర్ణలత, డీఆర్‌వో వెంకట రాజు, నవనిర్మాణ సమితి ప్రధాన కార్యదర్శి ఏవీ రఘురామ్, ప్రాజెక్టు డైరెక్టర్ ఎ. శివరామ్, ఏపీడీ లాలం సీతయ్య, ఏపీవో రాజు, శాస్త్రవేత్తలు డాక్టర్ బయ్యపు రెడ్డి, డాక్టర్ బాలహూస్సేన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫారం ఫండ్ పనులతో ఉపయోగాలు

జి.మాడుగుల: ఉపాధి నిధులతో చేపట్టే ఫారం ఫండ్ పనులతో ఎన్నో ఉపయోగాలు ఉంటాయని ఎంపీపీ కళ్యాణి సూచించారు. మండలంలోని శనివారం వంతాల పంచాయతీలో ఆయన పనులు ఆమె ప్రారంభించారు. ఉపాధి కూలీలు ఈ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ తిరుపతమ్మ, మాజీ సర్పంచ్ కొండబాబు, పెసా కమిటీ నాయకులు పి.మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి కుంటలతో గిరిజన రైతులకు మేలు: గిడ్డి ఈశ్వరి

పాడేరురూరల్: నీటి కుంటలు తవ్వకంతో గిరిజన రైతులకు ఎంతో మేలు జరుగుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. ప్రపంచ జలదినోత్సవం సందర్భంగా మండలంలోని ఇరడాపల్లి పంచాయతీ రాయిగెడ్డ గ్రామంలో ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా చేపట్టిన నీటికుంటల(ఫామ్ పాండ్స్) తవ్వకాల పనులను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు డప్పోడి వెంకటరమణ, ఎంపీపీ ఎస్.రత్నకుమారి, ఇరడాపల్లి సర్పంచ్ గల్లెల శ్రీజ, లగిశపల్లి సర్పంచ్ ఎల్.పార్వతమ్మ, మాజీ ఎంపీపీ రమనమూర్తి, టీడీపీ నాయకులు బి.రాంబాబు, ఆర్.కొండబాబు, బి.చిన్నయ్య, ఉపాధి హామీ పథకం అధికారులు పాల్గొన్నారు.

శ్రీరామ నవమి ఉత్సవాలకు పందిరి రాట


పందిరి రాట కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

పాడేరురూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పాడేరు సుండ్రుపుట్టు గ్రామంలోని రామాలయంలో శ్రీరామ నవమి ఉత్సవాల కోసం ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దల సమక్షంలో శనివారం పందిరి రాట కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. వచ్చే నెల 5, 6, 7వ తేదీలలో మూడు రోజుల పాటు ఈ వేడుకలను నిర్వహించేందుకు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు దన్నేటిపలాసి సురేశ్, రాము, రాంబాబు, లింగమూర్తి, రఘుబాబు, కోటిబాబు, ప్రసాద్, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపునకు చర్యలు

» 'ఆంధ్రజ్యోతి'కథనానికి స్పందన


వ్యాపారులకు ఆదేశిస్తున్న డీపీవో లవరాజు

పాడేరురూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పాడేరులో ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణాలను వెంటనే తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. 'పాడేరులో మళ్లీ ట్రాఫిక్ కష్టాలు' శీర్షికన ఈ నెల 18వ తేదీన 'ఆంధ్రజ్యోతి' లో ప్రచురితమైన కథనంపై స్పందించిన కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ స్పందించారు. ఇరువైపులా ఉన్న దుకాణాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. దీంతో జిల్లా పంచాయతీ అధికారి బి.లవరాజు, ఎంపీడీవో జె.తేజరతన్, ఈవోపీఆర్‌డీ ఆర్‌వీఎస్.రమేశ్ పోలీసు బృందంతో శనివారం రోడ్డు పక్కన ఉన్న కాయగూరలు, పండ్ల, చేపల దుకాణాలను తొలగించాలని వ్యాపారులకు ఆదేశించారు.

ఆలయంలో చోరీ

పాడేరురూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలవీధి పంచాయతీ కేం ద్రంలోని మోదకొండమ్మ ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. అమ్మవారి నగలు, హుండీలోని నగదును అపహరించారని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి తరువాత ఆలయం గేటు తాళాలు పగలుగొట్టి లోనికి ప్రవేశించినట్టు చెబుతున్నారు. ఆలయంలో ఉన్న బీరువా దాచిన అమ్మవారికి చెందిన రెండు జతలు శతమానాలు, నల్లపూసలు, వెండి పాదాలు, శఠగోపం, పంచామృత పాత్రను అపహరించారన్నారు. ఈ ఘటనపై ఎస్ఐ ఎ.సూర్యనారాయణ వద్ద ప్రస్తావించగా, సంఘటనా స్థలానికి చేరుకొని క్లూస్ టీమ్ సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్టు చెప్పారు.

నేటి నుంచి జిల్లాలో తేలికపాటి వర్షాలు

చింతపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఆదివారం నుంచి తేలికపాటి వర్షాలు కురవనున్నాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. శనివారం రాగల ఐదు రోజుల వాతావరణ సమాచారాన్ని శాస్త్రవేత్తలు ప్రకటించారు. ఈమేరకు 26తేదీ వరకు రంపచోడవరం, చింతపల్లి, పాడేరు, అరకు డివిజన్ల పరిధిలో కనిష్ఠంగా 0.5మిల్లీ మీటర్లు నుంచి గరిష్ఠంగా 2.3మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవుతుందన్నారు.

భగవద్గీత శ్లోకాల పోటీ

పాడేరురూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఉగాది వేడుకలు సందర్భంగా స్థానిక గిరి కైలాస క్షేత్రంలో భగవద్గీత శ్లోక పఠన పోటీలు శనివారం నిర్వహించారు. ఉమా నీలకంఠేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించాని ఈ పోటీల్లో 5వ తరగతి నుంచి 10వ తరగతి విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు పోటీపడ్డారు. ఈ కార్యక్రమంలో విజేతలకు ఈ నెల 30వ తేదీన బహుమతులు అందిస్తామని ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నాయుడు తెలిపారు.

వార్షికోత్సవానికి వైకుంఠగిరి ముస్తాబు

» నేటి నుంచి అనంత వేంకటేశ్వస్వామి ఉత్సవాలు

» ఘనంగా ఏర్పాట్లు

» దర్శించుకోనున్న వేలాది మంది భక్తులు


అనంత వేంకటేశ్వరస్వామి ఆలయం

అనంతగిరి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అనంతగిరి, గంట్యాడ మండలాల సరిహద్దు ప్రాంతమైన ఎగువకొండపర్తి గ్రామంలోని అనంత వేంకటేశ్వరస్వామి ఆలయం ప్రథమ వార్షికోత్సవం అంగరంగ వైభవంగా జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆలయం నిర్మాణం పూర్తయి ఏడాది కావడంతో శు క్రవారం నుంచి మూడు రోజులపాటుగా ఈ వార్షికోత్సవం నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు. సుమారు రూ.10కోట్ల వ్యయంతో రెండేళ్లపాటు శ్రమించి ఈ ఆలయాన్ని అద్భుతంగా నిర్మించారు. సముద్రమట్టానికి 3333 అడుగులు ఎత్తులో ఉంటుంది. అలాగే, ఆపైన తొమ్మిదిన్నర అడుగుల ఎత్తున ఆలయంలో అనంత వేంకటేశ్వరస్వామి కొలువయ్యారు. స్వామివారి దర్శనం కోసం భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తుంటారు. వార్షికోత్సవం నేపథ్యంలో భక్తులకు అసౌకర్యంలేకుండా ఆలయ ధర్మకర్తలు కర్రి సముద్రరెడ్డి (సాగర్), శ్రీవిద్య కృషిచేస్తున్నారు. ఈ ఉత్సవాలు 23, 24, 25 తేదీల్లో కొనసాగుతాయి.

నేటి పూజా కార్యక్రమాలు

ఆదివారం ఉదయం 8.15 గంటలకు ఆలయ ప్రదక్షణ, గోపూజ, శ్రీ విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, పరిషత్, రుత్విక్‌వరుణం, రక్షా సూత్రధారణం, ద్వారా కుంభ ఆవాహనలు, పతాక ప్రతిష్ఠ, మృత్యంగ్రహణం, అంకుర్పారణ, ధ్వజారోహణం, హోమం.. సాయింత్రం.. వైకుంఠగిరి వారసుడు శ్రీ భూ సమేత అనంత వేంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. శ్రీమాన్ చామర్తి శ్రీ ధరాచార్య స్వామి వారి ఆధ్వర్యంలోని మూడు రోజులు పాటుగా ప్రత్యేక పూజా కార్య క్రమాలు నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త కర్రి సముద్రరెడ్డి (సాగర్) తెలిపారు.

ఆలయానికి ఇలా చేరుకోవాలి..

విజయనగరం జిల్లా ఎస్.కోట నుంచి కాశీపట్నం 12 కిలో మీటర్లు ప్రయాణిం చి, అక్కడ నుంచి కుడిచేతివైపుగా ఎస్ఆర్‌పురం రోడ్డులో 18 కిలో మీటర్ల మేర వె ళ్ల డం ద్వారా వై కుంఠ గిరి వద్దకు చే రుకోవచ్చు.. 18 కిల్లో మీటర్ల ప్ర యాణంలో 36 మలుపుల తో తిరుమల తిరుపతి దేవ స్థానాన్ని దర్శించుకున్నామనే అనుభూతి, భావన భక్తుల్లో కలుగుతుంది.


వేంకటేశ్వస్వామి

ఆర్థిక ఆసరా కల్పిస్తే... కిలిమంజారో అధిరోహిస్తా..

» కొత్తపల్లికి చెందిన అభిరామ్


ట్రెక్కింగ్‌లో శిక్షణ పొందుతున్న అభిరామ్

మోతుగూడెం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న కొత్తపల్లికి చెందిన సర్పంచి సోడే తిరుపతమ్మ, అప్పారావుల కుమారుడు 14ఏళ్ల అభిరామ్ పర్వతారోహణపై మక్కువ పెంచుకున్నాడు. చింతూరులోని గురుకుల పాఠశాలలో ఈ బాలుడు 9వ తరగతి చదువుతున్నాడు. ఎవరెస్టు అధిరోహించిన వీఆర్‌పు రం మండలం కుంజవారి గూడేనికి చెందిన కుంజా దుర్గారావు స్ఫూర్తి, సూచనలతో అభిరామ్ కిలిమంజారో పర్వతం అధిరోహించాలనుకున్నారు. కుమారుడి ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు ఈనెల 14నుంచి 16వరకు తెలంగాణలోని భువనగిరిలో ట్రెక్కింగ్‌లో శిక్షణ ఇప్పించారు. కిలిమంజారో అధిరోహణ ఆర్థికభారం కావడంతో వారు ఇటీవల ఐటీడీఏ పీవో అపూర్వ భరత్‌ను కలిశారు. తమ కుమారుడి ఆశ నెరవేర్చేందుకు ఐటీడీఏ నుంచి ఆర్థిక సాయం చేయాలని కోరారు. దీనిపై స్పందించిన పీవో ముందుగా అభిరామ్‌కు పాస్‌పోర్టు చేయించాలని, ఆర్థిక సహా యం అందించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్టు బా లుడి తల్లిదండ్రులు తెలిపారు. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో ఎవరెస్టు శిఖరం అధిరోహించాలన్నదే తన లక్ష్యమని అభిరామ్ తెలిపాడు.

'తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌ల టెండర్ కొనసాగించాలి'

పాడేరురూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ పథకానికి సంబంధించిన 102 వాహనాల టెండర్‌ను కొనసాగించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతూ సీఐటీయూ జిల్లా సమాయ కార్యదర్శి ఎల్ సుందరరావు ఆధ్వర్యంలో ఉద్యోగులు శనివారం జిల్లా ఆస్పత్రి వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సుందరరావు మాట్లాడుతూ కేవలం రూ. 7,870 వేతనానికే కెప్టెన్‌లుగా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సిబ్బంది పనిచేస్తున్నామని వాపోయారు. ఈకార్యక్రమంలో దామోదరం, కొండబాబు, సింహాచలం, గణపతి పాల్గొన్నారు.

పంటల మార్పుపై శిక్షణ

పాడేరురూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ప్రాతీయ వ్యవసాయ పరిశోధన స్థానం మార్టేరువారి ఆధ్వర్యంలో స్థానిక ఏరువాక కేంద్రంలో 25 మంది వ్యవసాయ విస్తరణాధికారులకు పంట మార్పుపై శనివారం నిర్వహించిన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. చింతపల్లి సహపరిశోధన సంచాలకులు డాక్టర్.ఎ.అప్పలస్వామి మాట్లాడుతూ ఏజెన్సీలో వేరుశనగ, కొమ్ముశనగ, ఆవాలు తదితర పంటలను సాగు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన పరిశోధకులు డాక్టర్.బి.సహదేవ్ రెడ్డి, డాక్టర్.కె.తేజేశ్వరరావు, వ్యవసాయ సహాయ సంచాలకులు ఎల్ఆర్‌బీ.పాత్రుడు పలు సూచనలు చేశారు. పలు మండలాల రైతు సేవా కేంద్ర సిబ్బంది, విస్తరణాధికారులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

» మండల సమావేశంలో ఎంపీపీ ఈశ్వరి


మాట్లాడుతున్న ఎంపీపీ ఈశ్వరి

డుంబ్రిగుడ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాగునీటి ఎద్దడి నివారణకు 15వ ఆర్థిక సంఘం నిధులతో బోర్లు మరమ్మతుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎంపీపీ ఈశ్వరి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గిరిజనులు ఆరోగ్య పరిరక్షణకు తోడ్పాటునిచ్చే ఆసుపత్రుల అభివృద్ధి కమిటీలపై స్పష్టత నివ్వాలని పలువురు ప్రజా ప్రతినిధులు కోరారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులకు స్థానిక ప్రజా ప్రతినిధులను ఎందుకు ఆహ్వానించడంలేదని పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు అధికారులను నిలదీశారు. వెలుగు ద్వారా తీసుకున్న రుణాలు నెల వారీగా చెల్లించే వాటికి రశీదులు ఇచ్చే ప్రక్రియను చేపట్టాలని సంబంధిత అధికారులను సూచించారు. మండలంలో రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రొక్లెయిన్లతో ఇసుక తవ్వకాలను నిరోధించాలని ప్రజా ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, తహసీల్దార్ ముజీబ్, వివిధశాఖ అధికారులు, పాల్గొన్నారు.

తుప్పల్లో మృత శిశువు లభ్యం

పాడేరురూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పసికందును తుప్పల్లో పడేసిన ఘటన పాడేరు నీలకంఠానగర్ ప్రాంతంలో శనివారం ఉదయం కలకలం రేపింది. స్థానికులు అందించిన వివరాలివి... శనివారం ఉదయం 7 గంటల సమయంలో గుర్తుతెలియని ఒక వ్యక్తి ప్లాస్టిక్ కవరును నీలకంఠానగర్‌సమీపాన తుమ్మరమెట్ట గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న కాలువ పడేశాడు. దీనిని గుర్తించిన మహిళలు ప్రశ్నించినా ఆ వ్యక్తి మాట్లాడుకుండా వెళ్లిపోయాడు. అంతలోనే వీధి కుక్కలు ఆ కవర్‌లో శిశువును ఈడ్చువెళ్లేందుకు ప్రయత్నించాయి. స్థానికులు అప్రమత్తమై విడిపించారు. ఆ శిశువు మృతి చెందినట్లు గుర్తించారు. స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ ఎ.సూర్యనారాయణ సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. వీఆర్‌వోలు మర్రి చెట్టు రామునాయుడు, జి.రవికుమార్‌లు శిశువు మృతదేహాన్ని స్థానిక జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించి శిశువును పడేసిన వ్యక్తుల గురించి ఆరాతీస్తున్నారు.

తాగునీటి పథకాలు ప్రారంభం

కొయ్యూరు మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నవనిర్మాణ సమితి ఆధ్వర్యంలో ఐదు గ్రామాల్లో నిర్మించిన తాగునీటి పథకాలను సర్పంచి ముత్యాలమ్మ శుక్రవారం ప్రారంభించారు. వేసవి దృష్టిలో ఉంచుకుని బూదరాళ్ళ పంచాయతీ బొడ్డుమామిడి, పోకలపాలెం, అన్నవరం, గొర్రెలమెట్ట దొడవగొయ్యి గ్రామాల్లో రూ. 25 లక్షల వ్యయంతో నీరు- ఆరోగ్య పథకంలో భాగంగా భూమ్యకర్షణ ద్వారా నవనిర్మాణ సమితి ఆధ్వర్యంలో తాగునీటి పథకాలను ఏర్పాటు చేశారు. వీటిని సర్పంచి ముత్యాలమ్మ ప్రారంభించారు. సంస్థ మేనేజర్ వీర నాయుడు, సంస్థ కో ఆర్డినేటర్ నాగేశ్వరరావు, జూనియర్ ఇంజనీరు బుజ్జి, ఎంపీటీసీ సభ్యుడు నారాయణ, వార్డు సభ్యుడు సంజీవ్, కూటమి నేతలు కొండబాబు, కొర్ర తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.


గొర్రెలమెట్టలో కుళాయిని ప్రారంభిస్తున్న సర్పంచి తదితరులు

కాంపా స్కీమ్ ద్వారా అడవుల పెంపకం

» పాడేరు డీఎఫ్‌వో సందీప్ రెడ్డి


ంకటపాలెం నర్సరీని పరిశీలిస్తున్న డీఎఫ్‌వో సందీప్ రెడ్డి

జి.మాడుగుల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కాంపా స్కీమ్ ద్వారా అడవుల పెంపకం చేపడుతున్నట్టు పాడేరు అటవీ డీఎఫ్‌వో సందీప్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఆయన శనివారం బీరం పంచాయతీ, వి.కోడాపల్లి (వెంకటపాలెం)లో నిర్మించిన నర్సరీని పరిశీలించారు. అక్కడి నుంచి బీరం గ్రామంలో కాంపా పథకం ద్వారా ముందస్తు చేపట్టిన పనులను తనిఖీ చేశారు. అడవుల రక్షణలో భాగగా వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన వెంట ఎఫ్ఆర్‌వో ఆర్.అప్పలనాయుడు, ఎఫ్ఎస్‌వోలు జి.శ్రీరాములు, వివి.నాయుడు, బీట్ అధికారిని జి.భూదేవి, సిబ్బంది కె. సత్తిబాబు, ఎం.బాలన్న పాల్గొన్నారు.

దివ్యాంగ చిన్నారుల మెరుగైన చికిత్సకు కృషి


కార్యకర్తలకు ఐఎఫ్‌పీ ప్యానల్ బోర్డు ద్వారా శిక్షణ ఇస్తున్న సీడీపీవో జీవీ రమ

చింతపల్లి, మార్చి 22 (ఆంధజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో దివ్యాంగ చిన్నారులను కార్యకర్తలు మెరుగైన చికిత్స అందించేలా చూడాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో జీవీ రమణ అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజులుగా జరుగుతున్న పోషణ్ భీ పడాయి శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ ఆరేళ్లలోపు చిన్నారులకు పోషకారం సక్రమంగా అందించాలన్నారు. చిన్నారుల ఎదుగుదల, ఆరోగ్య స్థితిగతులను కార్యకర్తల ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో పీవీవీవీ ప్ర సాద్, సూపర్‌వైజర్లు కె. విజయకుమారి, ఎస్కే. గౌహర్ ఉన్నీష, ఎస్.గౌరి, పి. అప్పలనర్స పాల్గొన్నారు.

చిన్నారుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి: సీడీపీవో వరహాలమ్మ

ముంచంగిపుట్టు: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల సంరక్షణపై కార్యకర్తలు ప్రత్యేక దృష్టిసారించాలని సీడీపీవో వరహాలమ్మ అన్నారు. స్థానిక వెలుగు సమావేశ మందిరంలో శనివారం అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

జి..మాడుగుల: అంగన్‌వాడీలకు చేపట్టిన పోషణ బీ పడాయి బి పై శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా మానవహారం నిర్వహించారు. స్థానిక ఐసీడీఎస్ సీడీపీవో సువర్ణమ్మ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: చిన్నారులు ఆరోగ్యంపై అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో ఎ. లక్ష్మీదేవి అన్నారు. శనివారం పోషన్ బీ పడాయి బీ శిక్షణ కార్యక్రమం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్‌వైజర్లు డి.వలసమ్మ, కె.రామలక్ష్మి, డి. మోహిని, కె. కృష్ణకుమారి పాల్గొన్నారు.

పాడేరురూరల్: పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలని సీడీపీవో పి.ఝాన్సీరాణి సూచించారు. పాడేరు ప్రాజెక్టు పరిధిలో కార్యకర్తలకు శిక్షణ శనివారం ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.

వ్యాధులపై అప్రమత్తం

ముంచంగిపుట్టు, మార్చి 22(ఆంధ్రజ్యోతి):వ్యాధులు బారిన పడకుండా ఉండేందుకుగాను ప్రతీ ఒక్కరూ తగు ఆరోగ్య సూత్రాలను పాటించాలని కిలగాడ పీహెచ్‌సీ డాక్టర్ రమేష్ అన్నారు. మండలంలోని బంగారుమెట్ట పంచాయతీ బాదిపుట్టు, మెట్టబాదిపుట్టు గ్రామాల్లో శనివారం ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించారు. 82 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సేవలు, మందులు అందించారు. మలేరియా, డయేరియా, టైఫాయిడ్, టీబీ గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్రహ్మణ్యం, వైద్య సిబ్బంది వెంకటేశ్వరమ్మ, త్రివేణి, ప్రసాదు, కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పనస కల్వర్టు మరమ్మతు చేపట్టాలి


కోతకు గురైన కల్వర్టును పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ భాగ్యవతి

ముంచంగిపుట్టు, మార్చి 22(ఆంధ్రజ్యోతి) : మండలంలోని వనుగుమ్మ పంచాయతీ పనస గ్రామ సమీపంలో ప్రధాన రహదారిపై దెబ్బతిన్న కల్వర్టు మరమ్మతు చేపట్టేలా అధికారులు చొరవ చూపాలని వైస్ ఎంపీపీ ఎస్.భాగ్యవతి అన్నారు. దెబ్బతిన్న ఈ కల్వర్టును ఆమె శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కల్వర్టు కోతకు గురికావడంతో వాహన రాకపోకలకు ఇబ్బంది నెలకొందన్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి ఎన్ని సార్లు తీసుకువెళ్లినా స్పందన కానకావడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. సర్పంచి మిల్కి, వైసీపీ నేతలు దేవ, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి



శిబిరంలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

చింతపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): గిరిజన యువత రక్తదానం చేసేందుకు ముందుకురావాలని రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొర్ర నాగరాజు అన్నారు. శనివారం కలెక్టర్ ఆదేశాలతో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయభారతి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 52మంది యువతీ, యువకులు, అధ్యాపకులు రక్తదానం చేశారు. ఈసందర్భంగా నాగరాజు మాట్లాడుతూ రానున్న రోజులు ఏజెన్సీలో అత్యధిక సంఖ్యలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయభారతి, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షులు గంగరాజు, కార్యదర్శి గౌరీశంకర్, కోశాధికారి సూర్యారావు, సభ్యుడు ప్రసాద్ నాయుడు, వైద్యాధికారులు రాఘవేంద్ర, రాజా రవీంద్రనాథ్ చౌదరి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసపాత్రుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్షయపై అప్రమత్తం

చింతపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): క్షయపై గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని కోరుకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి శివ ప్రసాద్ అన్నారు. శనివారం క్షయ వారోత్సవంలో భాగంగా కోరుకొండలో అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ రెండు వారాలపాటు దగ్గు, జ్వరం కలిగి ఉంటే కళ్లె పరీక్ష చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ జరిగితే క్రమంగా మందులు వాడాలన్నారు.రోగుల పోషకాహారం కోసం ప్రభుత్వం నెలకు రూ.వెయ్యి అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో క్షయ సూపర్‌వైజర్ ప్రసాద్ పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: మండల కేంద్రంలో డంబ్రిగుడలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది క్షయ వ్యాధి ప్రపంచ దినోత్సవ ర్యాలీని చేపట్టారు. వైద్యాధికారి రాంబాబు అధ్వర్యాన జరిగిన ర్యాలీ పీహెచ్‌సీ నుంచి జాతీయ రహదారి వరకు సాగింది. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


గరగల పూజలో పాల్గొన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు దంపతులు

నేత్రపర్వంగా నూకాలమ్మ మొదటి జాగారం

నర్సీపట్నం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నూకాలమ్మ మొదటి జాగారం శనివారం రాత్రి నేత్రపర్వంగా జరిగింది. వెలమవీధిలోని స్పీకర్ అయ్యన్న పాత్రుడు పాత ఇంటి నుంచి జాగారం ప్రారంభమైంది. ముందుగా గరగలకు పూజలు నిర్వహించారు. కోలాటాలు, చిడతలు, కాంగో డబ్బులు, బాణసంచాతో పట్టణంలో గరగలు ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పద్మావతి, రాజేశ్, దివ్య దంపతులు అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు చేశారు. డీఎస్పీ శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ కొరుప్రోలు శ్రీను తదితరులు జాగారంలో పాల్గొన్నారు.

పీఎస్ పేట రోడ్డు నిర్మాణం పూర్తిచేయండి

▸▸ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు


పీఎస్ పేట రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా పీఎస్ పేట రహదారి పనులు పూర్తిచేయాలని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ఆదేశించారు. పట్టణంలోని కొత్తూరు జంక్షన్ వద్ద పీఎస్‌పేట రహదారి పనులను శనివారం పరిశీలించారు. మూడు మండలాల ప్రజలకు కీలకమైన ఈ రహదారి పనులను వేగంగా పూర్తిచేసి, ప్రజలకు అందుబాటులోనికి తీసుకురావాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు.

పంట కుంటలు ప్రారంభం


కొబ్బరి మొక్క నాటుతున్న ఎమ్మెల్యే

బుచ్చెయ్యపేట: కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రంలో పంట కుంటలను ఎమ్మెల్యే రాజు శనివారం ప్రారంభించారు. అనంతరం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో వ్యవసాయ, క్షీర విప్లవం తీసుకురావాలన్నదే తన లక్ష్యమన్నారు. ప్రతీ రైతు తమ ఇళ్లను మినీ వ్యవసాయ క్షేత్రంగా తయారు చేసుకోవాలన్నారు. గట్లపై ఫలసాయం ఇచ్చే మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, ఏపీవో వరహాలుబాబు, ఎంపీపీ నాగేశ్వరీదేవి, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, నాయకులు కోటేశ్వరరావు, ఎంవీ.సత్యనారాయణ, దొంకిన అప్పలనాయుడు, వియ్యపు అప్పారావు, దొండా నరేశ్, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

డ్రైనేజీల్లో పూడిక తొలగింపు


రావికమతంలోని డ్రైనేజీల్లో పూడికలు తొలగిస్తున్న దృశ్యం

రావికమతం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడికలను ఎట్టకేలకు శనివారం యంత్రాలతో తొలగించారు. పలు వీధుల్లో చెత్తచెదారాన్ని ఎక్స్‌కవేటర్‌తో తీయించారు. సర్పంచ్, గంజి మంగ, ఉప సర్పంచ్ మోదునాయుడు చొరవతో పంచాయతీ కార్యదర్శి కృష్ణమోహన్ పర్యవేక్షణలో పారిశుధ్య కార్మికులు ఈ కార్యక్రమం చేపట్టారు. మనుషులు తీయడం సాధ్యం కాకపోవడంతో డ్రైనేజీలను యంత్రంతో తీయిస్తున్నామని కార్యదర్శి కృష్ణమోహన్ తెలిపారు.

తైవాన్ ఆర్టిస్టిక్ రోలార్ స్కేటింగ్‌కు చైత్ర దీపిక ఎంపిక


చైత్ర దీపిక

నర్సీపట్నం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తైవాన్ ఆర్టిస్టిక్ రోలార్ స్కేటింగ్ ఓపెన్ కాంపిటేషన్స్‌లో నర్సీపట్నానికి చెందిన పి.చైత్రదీపిక భారతదేశం తరపున పాల్గొంటుంది. తైవాన్‌లో ఈ నెల 24 నుంచి 30వ తేదీ వరకు పోటీలు జరగనున్నాయి. జాతీయ, అంతర్జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో చైత్రదీపిక ప్రతిభ కనబరిచింది. ఆమె విజయవాడలో చదువుకుంటుంది.

'రిజర్వేషన్లలో రెల్లి కులస్థులకు అన్యాయం'

మాడుగుల రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణలో భాగంగా రెల్లి సామాజిక వర్గీయులకు ఒక శాతం రిజర్వేషన్ కల్పించడం అన్యాయమని మాడుగుల రెల్లి కులస్థులు ఆరోపించారు. పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. రాష్ట్రంలో రెల్లి కులస్థులు లక్షల సంఖ్యలో ఉన్నారని, ఒక శాతం రిజర్వేషన్ కల్పించడం అన్యాయమని వారు వాపోయారు. సంఘం సభ్యులు రాజు, పోలరాజు, మణిబాబు, చిన్న, రమేశ్, సుధాకర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మలేషియాలో చిక్కుకున్న జి.నగరం వాసి

స్వదేశానికి తీసుకురావాలని కుటుంబ సభ్యుల వేడుకోలు


భూషణం (ఫైల్)

మాకవరపాలెం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జి.వెంకటాపురం పంచాయతీ శివారు జి.నగరానికి చెందిన ఒమ్మి భూషణం ఆరేళ్లుగా మలేషియా దేశంలో చిక్కుకుపోయాడు. 2019లో బతుకు తెరువు కోసం బ్రోకర్ ద్వారా మలేషియా వెళ్లాడు. అక్కడ ఒక హోటల్‌లో పనిచేస్తున్నాడు. అతనికి జీతం కూడా ఇవ్వకుండా అరకొరగా భోజనం పెట్టి పని చేయించుకుంటున్నారు. దీంతో స్వగ్రామం వచ్చేందుకు మూడేళ్లుగా ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ అతని వద్ద ఉన్న వీసా తీసుకొని ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు ఆయన వీడియో సందేశాన్ని కుటుంబ సభ్యులకు పంపారు. దీంతో అతని కుటుంబ సభ్యులు మనోవేదనకు గురవుతున్నారు. చివరకు తన కుటుంబ సభ్యులు చనిపోయినా పంపించలేదని భూషణం వాపోయాడు. కుమార్తె వివాహానికి కూడా అతడిని పంపించలేదని వీడియోలో పేర్కొన్నాడు. ఈ వీడియో రావడంతో భూషణం భార్య మంగ, కూతురు శ్రావణి, కొడుకు సాయి బోరున విలపిస్తున్నారు. తన భర్తను స్వదేశానికి రప్పించేలా ప్రభుత్వం కృషిచేయాలని వారు టీడీపీ సీనియర్ నాయకులు యర్రంశెట్టి రమణకు వివరాలు అందజేశారు. ఈ విషయాన్ని రమణ తహసీల్దార్ రామారావు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై పూర్తి వివరాలు సేకరించి జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేస్తానని తహసీల్దార్ తెలిపారు. భూషణంను స్వదేశానికి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తామన్నారు.

తప్పుడు మస్తర్లు వేసిన ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు

▸▸ డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ పూర్ణిమదేవి


సామాజిక తనిఖీల ప్రజావేదికలో మాట్లాడుతున్న పీడీ పూర్ణిమదేవి

నాతవరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనుల్లో పనికి రాకుండానే తప్పుడు మస్తర్లు వేసిన ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తప్పవని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్.పూర్ణిమదేవి హెచ్చరించారు. మండలంలోని 31 పంచాయతీల్లో రూ.20 కోట్ల 70 లక్షలతో చేపట్టి పనులకు సంబంధించి చేపట్టిన సామాజిక తనిఖీలపై శనివారం ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ సామాజిక తనిఖీలలో వల్లంపేట, వైబీఅగ్రహారం ఫీల్డ్ అసిస్టెంట్లు దొంగ మస్తర్లు వేశారని అభియోగాలు వచ్చాయన్నారు. దీనిపై విచారణ జరిపి వాస్తవమైతే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లాలోని 2025-26లో కోటి 27 లక్షల పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆమె తెలిపారు. అలాగే జిల్లాలోని 646 పంచాయితీలకు ఐదు గోకుల శాలలు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. ప్రతీ పంచాయితీలో 25 పంట కుంటలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. మార్చి 29వ తేదీ నాటికి సామాజిక తనిఖీల ప్రజావేదికలను పూర్తి చేస్తామన్నారు. బుచ్చెయ్యపేట, మాకవరపాలెంతో పాటు మరో రెండు మండలాల్లో సామాజిక తనిఖీలు పూర్తి చేయాల్సి ఉందని చెప్పారు. ఉపాధి హామీ పథకంలో రైతుల భూములను కూడా అభివృద్ధి చేసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి సిహెచ్.నిర్మలదేవి, ఎంపీడీవో ఉషశ్రీ, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో చిన్నారావు, స్టేట్ రిసోర్స్‌పర్సన్ ఎం.నాగరాజు, రాష్ట్ర ఎస్సీ సెల్ డైరెక్టర్ కొంద్రు మరిడియ్య, తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, మాజీ ఎంపీపీలు పారుపల్లి కొండబాబు, సింగంపల్లి సన్యాసిదేముడు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌కు స్వస్తి పలకండి

▸▸ డీఎల్‌డీవో మంజులావాణి


మామిడిపల్లిలో చీపురు పట్టుకుని పరిశుభ్రంపై సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎల్‌డీవో

దేవరాపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు స్వస్తి పలకాలని డీఎల్‌డీవో మంజులావాణి సూచించారు. మండలంలోని ముషిడిపల్లి, మామిడిపల్లి గ్రామాల్లో శనివారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డీఎల్‌డీవో నేరుగా చీపురు పట్టుకొని పరిసరాలను పరిశుభ్రం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బయట మల విసర్జన వల్ల కలిగే నష్టాలను వివరించారు. దుకాణాల నుంచి వచ్చే వ్యర్థాలను రహదారిపై వేయకూడదని సూచించారు. పరిసరాలను పరిశుభ్రతతోనే ఆరోగ్యం మెరుగుపడుతుందని చెప్పారు. అనంతరం సచివాలయంలో ఉద్యోగులతో సమావేశం నిర్వహించి, ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సువర్ణరాజు, హౌసింగ్ ఏఈఈ తేజ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ చంద్రశేఖర్, కోఆర్డినేటర్ వి.పి.వి.త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పాలిథిన్ కవర్లు వాడొద్దు

చీడికాడ: గ్రామాల్లో పాలిథిన్ కవర్లు వాడవద్దని, వాటిని వాడితే చర్యలు తీసుకుంటామని మండల ప్రత్యేకాధికారి మూర్తి స్పష్టం చేశారు. జి.కొత్తపల్లి గ్రామంలో శనివారం స్వచ్ఛత సేవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అన్ని వీధులు, డ్రైనేజీలను పరిశీలించి చెత్తను తొలగించారు. అలాగే దుకాణాల వద్ద చెత్త బుట్టలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హేమసుందర్రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎస్.కనకమ్మ, పంచాయతీ కార్యదర్శి పట్నాలగోపి, సర్పంచ్ కొల్లి సూరినాయుడు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తేలని లారీ ఆపరేటర్ల వివాదం

▸▸ గోవాడలో కాటాలకు వెళ్లని లారీలు

▸▸ నష్టాన్ని ఆపరేటర్ల నుంచి వసూలు చేయాలని రైతుల డిమాండ్

చోడవరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): గోవాడ ఫ్యాక్టరీకి చెరకు సరఫరా చేసే లారీల ఆపరేటర్లు కాటాల నుంచి చెరకు రవాణా ప్రారంభించకపోవడంతో శనివారం కూడా కాటాలకు లారీలు వెళ్లలేదు. దీంతో తాము నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు బకాయిలు ఇస్తే తప్ప లారీలు తిప్పేది లేదంటూ లారీల ఆపరేటర్లు నాలుగు రోజుల నుంచి గోవాడ ఫ్యాక్టరీలోనే లారీలతోనే చెరకు ఉంచి అన్‌లోడింగ్ చేయకుండా వదిలేసి వెళ్లిపోవడం వివాదాస్పదంగా మారిన సంగతి తెలిసిందే. ఆపరేటర్లకు ఫిబ్రవరి నెలాఖరు వరకు రూ.18 లక్షలు బకాయిలు ఇచ్చినప్పటికీ, లారీల యపజమానులు స్పందించలేదు. శుక్రవారం గోవాడ ఎండీ, సీఐ అప్పలరాజులు లారీల యజమానులతో మాట్లాడినా చెరకు అన్‌లోడింగ్ చేయలేదు. శనివారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో లారీల నుంచి చెరకు అన్‌లోడింగ్ చేసినప్పటికీ, కాటాల నుంచి చెరకు తీసుకురావడానికి వెళ్లలేదు. కాగా లారీల ఆపరేటర్ల నిర్లక్ష్యంతో నాలుగు రోజులుగా లారీలలో చెరకు ఉండిపోయినందున, నష్టాన్ని లారీల ఆపరేటర్ల నుంచి వసూలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. చెరకు ఎండిపోవడం వల్ల దిగుబడి రాదని, ఈ నష్టానికి లారీల ఆపరేటర్లు బాధ్యత వహించాలని రైతులు అంటున్నారు. అలాగే కాటాల వద్ద ఉండిపోయిన చెరకు తరలింపునకు యాజమాన్యం ప్రత్యామ్నాయ చర్యలు వెంటనే చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

వైస్ ఎంపీపీ ఎన్నికపై మాజీ మంత్రి అమర్ సమావేశం

చోడవరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వైస్ ఎంపీపీ ఎన్నికపై వైసీపీ కార్యాలయంలో పార్టీ చోడవరం ఇన్‌చార్జి, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ శనివారం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ ఎన్నికలో అనుసరించాల్సిన వ్యూహంపై ఎంపీటీసీ సభ్యులు, నేతలతో అమర్ చర్చించారు. ఈ సమావేశంలో వైసీపీ నాయకులు ఏడువాక సత్యారావు, బైన ఈశ్వరరావు. బొడ్డేడ సూర్యనారాయణ, చందు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణ అందరి బాధ్యత

నాతవరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నీటిని సంరక్షణ అందరి బాధ్యతని డ్వామా పీడీ పూర్ణిమదేవి చెప్పారు. వైడీపేటలో నీటి కుంటలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీటి కుంటలను ఏర్పాటు చేయడంతో భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. అలాగే రేపటి మనుగడ కోసం నీటిని వృథా చెయ్యవద్దని కోరారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి నాగశిరీషా, టీడీపీ మండల అధ్యక్షుడు ఎస్.వెంకటరమణ, తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ, నాయకులు శెట్టి గోపీ, గవిరెడ్డి త్రినాథ్, సన్యాసిదేముడు పాల్గొన్నారు.

మార్చిలోగా పనులు పూర్తిచేయాలి: పీఆర్ డీఈ

మాకవరపాలెం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు మార్చిలోగా పూర్తిచేయాలని పంచాయతీరాజ్ శాఖ డీఈ ఈశ్వరరావు స్పష్టం చేశారు. మండలంలోని బూరుగుపాలెం, మాకవరపాలెం, రాచపల్లి, గ్రామాల్లో శ్మశాన వాటిక అభివృద్ధి పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రూ.92 లక్షలతో శ్మశానవాటిక అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ప్రతీ కాంట్రాక్టరు మార్చి నెల చివరి నాటికి పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి చిరంజీవి, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

బుచ్చెయ్యపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాలెం అగ్ని ప్రమాద బాధితులకు యాదవ సంఘం నాయకులు రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో యాదవ సంఘ మండల అధ్యక్షుడు సింగంపల్లి రమేశ్, సంఘం నాయకులు బి.సాయినాథరావు, సబ్బి శ్రీను, గోకివాడ కోటేశ్వరరావు, జోగ కొండబాబు, వి.అప్పారావు, కె.సోమునాయుడు, బి.నరసింహమూర్తి, జి.శ్రీరామ్, బి.వెంకటరమణ, ఎం.రామునాయుడు పాల్గొన్నారు.

ముగిసిన అంగన్‌వాడీల శిక్షణ తరగతులు

రోలుగుంట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బుచ్చెంపేట జడ్పీ పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇస్తున్న శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సూపర్‌వైజర్లు జి.రమ్య, ఎస్.హేమావతి మాట్లాడుతూ 0-6 లోపు గల పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలలో అంగన్‌వాడీల పాత్ర కీలమన్నారు. బోధనా సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కె.కోటపాడు: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో జరుగుతున్న అంగన్‌వాడీల శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. దివ్యాంగులైన పిల్లల సంరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఐసీడీఎస్ సీడీపీవో వి.మంగతాయారు అంగన్‌వాడీ కార్యకర్తలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎల్‌బి.సుశీల, జి.ఆదిలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చీడికాడ: తురువోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నవచేతన నూతన విద్యపై అంగన్‌వాడీలకు జరుగుతున్న శిక్షణ శనివారంతో ముగిసింది. పలు గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలకు ఈ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీవో సిహెచ్.శ్రీదేవి మాట్లాడుతూ పౌష్టికాహారం పిల్లలకు అందించేలా చూడాలని ఆదేశించారు. సూపర్‌వైజర్లు చిన్నమ్మలు, రమాదేవి పాల్గొన్నారు.

28న నూకాలమ్మ పండగ

నర్సీపట్నం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం నూకాలమ్మ పండగను ఈ నెల 28వ తేదీ అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని 25వ వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేశ్ తెలిపారు. శనివారం నూకాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ అధ్యక్షుగా కొరుప్రోలు శ్రీనివాసరావును, మరికొంత మందిని సభ్యులుగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి పండుగను ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రతీ ఒక్కరు పాల్గొని పండుగను విజయంతం చేయాలని ఆయన కోరారు.

కుటుంబ యజమానికే వారసత్వ భూములు

ప్రత్యేకాధికారి కేఎల్ఎన్.మూర్తి


ఫిర్యాదుదారులను విచారిస్తున్న ప్రత్యేకాధికారి

చీడికాడ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వారసత్వంగా వస్తున్న భూములు కుటుంబ యజమాని పేరున ఉంటాయని మండల ప్రత్యేకాధికారి కేఎల్ఎస్.మూర్తి స్పష్టం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ప్రజావేదిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బైలపూడి గ్రామానికి చెందిన గుమ్మాల భవానీ తమ పంట భూములు అత్త వరహాలమ్మ పేరున ఉన్నాయని, ఆ భూముల్లో సగం వాటా తన పేరున ఆన్‌లైన్ చేయాలని స్పందనలో కోరారు. దీనిపై ఎంపీడీవో వి.హేమసుందర్రావు, తహసీల్దార్ కిశోర్‌లింకర్, ఏఎస్ఐ నాగేశ్వరరావు తదితర అధికారుల సమక్షంలో విచారణ జరిపారు. అనంతరం వారసత్వంగా వచ్చిన భూములు కుటుంబ యజమాని అత్త పేరు మీద ఉంటాయని స్పష్టం చేశారు. తద్వారా భర్త, సతీమణికి వస్తాయన్నారు. కోనాం గ్రామంలో తమ ఇంటికి ఆనుకొని సిరగం అమ్మతల్లి టేకు మొక్కలు వేయడంతో చెట్లుగా ఎదిగి వేర్లు ఇంటిని నాశనం చేస్తున్నాయని, వాటిని తొలగించేలా చూడాలని రొబ్బ దేముడమ్మ ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులు విచారించిన తరువాత వెంటనే టేకు చెట్లును తొలగించాలని అమ్మతల్లిని ఆదేశించారు.

తెనుగుపూడిలో భూమి అన్యాక్రాంతంపై విచారణ


విచారణ చేపడుతున్న ప్రత్యేకాధికారి మంజులవాణి

దేవరాపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తెనుగుపూడిలో భూమి అన్యాక్రాంతమైందని బవిరిశెట్టి అప్పలస్వామి, శరన్న కుటుంబీకులు జిల్లా కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం విచారణ చేపట్టారు. మండల పరిషత్ కార్యాలయంలో ఫిర్యాదుదారులతో పాటు సాగు రైతులతో ప్రత్యేకాధికారి మంజులవాణి మాట్లాడారు. ఇరు వర్గాల దగ్గర రికార్డులను తహసీల్దార్ పి.లక్ష్మీదేవితో కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. ఇరు వర్గాల వాదనలు విన్నామని, విచారణ నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తామని ఈ సందర్భంగా విచారణ అధికారులు తెలిపారు. కాగా గర్సింగి వీఆర్‌ఏ మృతి చెందగా, ఆ పోస్టు తమకే ఇవ్వాలంటూ ఇద్దరు వ్యక్తులు చేసిన ఫిర్యాదును కూడా విచారించారు.

నీటి నాణ్యత పరీక్షకు బందవీధి బురద నీరు


నాణ్యత పరీక్షకు సేకరించిన నీరు

చీడికాడ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాం శివారు బందవీధి గ్రామంలో ఉన్న బోరునీటిని నాణ్యత పరిక్ష కోసం పంపిం చామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎస్.కనకమ్మ తెలిపారు. 'బందవీధి తాగునీటి బోరులో బురద నీరు' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో శనివారం ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. ఈ మేరకు బోరునీటిని సేకరించి ల్యాబ్‌కు పంపించినట్టు ఏఈ చెప్పారు. రిపోర్టు వచ్చాక బోరును బాగు చేయిస్తామని తెలిపారు.

మెడికల్ షాపుల్లో తనిఖీలు


దుకాణం ఆవరణలో తనిఖీలు చేస్తున్న కుక్క

గొలుగొండ మార్చి, 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏటిగైరంపేట, ఎర్రన్నపాలెం గ్రామాల్లోని మెడికల్ దుకాణాల్లో శనివారం నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ, గొలుగొండ ఎస్ఐ రామారావు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాలతో నర్సీపట్నం రూరల్ ప్రాంతాల్లోని మెడికల్ షాపుల్లో డ్రగ్స్‌పై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. మెడికల్ షాపుల్లో విక్రయిస్తున్న మందులు పరిశీలించారు. అలాగే రికార్డుల్లో రోగి పేరును తప్పకుండా నమోదు చేయాలన్నారు. ఏజెన్సీ ప్రాంతం నుంచి మైదాన ప్రాంతానికి గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. గతంలో గంజాయి రవాణా సాగించిన పాత నేరస్తులపై నిఘా ఏర్పాటు చేశామని సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

రాజాంలో నాగులాపల్లి విగ్రహావిష్కరణ


నాగులాపల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

బుచ్చెయ్యపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాజాంలో కార్మిక సంఘం నేత, మాజీ సర్పంచ్ నాగులాపల్లి విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించారు. సీఐటీయూఐ జాతీయ అధ్యక్షుడు ఎస్.కనకారావు, కార్యదర్శి నీరబ్‌చౌబే (పాట్నా), ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు, స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, డీసీసీ అధ్యక్షుడు మీసాల సుబ్బన్న, రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘ ప్రధాన కార్యదర్శి దంతులూరి వర్మ ఈ విగ్రహాన్ని ఆవిష్కరించారు. నాగులాపల్లి సత్యనారాయణ చేపట్టిన ప్రజా ఉద్యమాలు, కార్మిక పోరాటాల గురించి వక్తలు కొనియాడారు. జీవితకాలం పేద, బడుగు, బలహీన వర్గాల కోసం ప్రజా ఉద్యమాలు చేపట్టారన్నారు. నాగులాపల్లి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, నాయకులు కె.అచ్చెంనాయుడు, కోవెల జనార్దనరావు, జి.కోటేశ్వరరావు, కె.రవికుమార్, కార్మిక సంఘం నాయకులు నాగులాపల్లికి ఘనంగా నివాళులర్పించారు.

ఇంటర్వ్యూ..

180 హెక్టార్లలో వనాల పెంపకం

-పి.వి.రవివర్మ
అటవీ శాఖ రేంజ్ అధికారి



అటవీ శాఖ రేంజి పరిధిలో రానున్న ఆర్థిక సంవత్సరంలో 180 హెక్టార్లలో వనాల పెంపకం లక్ష్యంగా నిర్దేశించాం. అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు స్థానికుల సహకారం కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. జనావాసాల్లోకి కోతులు అడుగుపెట్టే అవకాశం లేకుండా పండ్ల మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం.

ప్రశ్న: ఈ ఏడాది అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏయే కార్యక్రమాలు చేపడుతున్నారు?

జవాబు: ఈ ఏడాది రేంజి పరిధిలో 180 హెక్టార్లలో వనాల పెంపకం చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

ప్రశ్న: జనావాసాల్లోకి కోతులు రాకుండా ఎటువంటి చర్యలు చేపడుతున్నారు.

జ: వన్య ప్రాణులు, పక్షులు, కోతులకు ఉపయోగపడేలా నేరేడు, జామ, ఉసిరి, ఇతర రకాల పండ్ల మొక్కలు పెంపకానికి ప్రాధాన్యత ఇస్తున్నాం. దీనివల్ల కోతులు జనావాసాల్లోకి రాకుండా నిరోధించవచ్చు.

ప్రశ్న: వేసవి సీజన్‌లో అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

జ: వేసవి ప్రారంభమైనందున అడవుల్లో అగ్ని ప్రమాదాలకు ఆస్కారం ఉంది. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా ట్రెంచ్‌లు తవ్వుతున్నాం. ఫైర్‌లైన్ ఏర్పాటు చేస్తున్నాం.

ప్రశ్న: అడవుల్లో ప్రమాదాలపై స్థానికులకు అవగాహన కల్పిస్తున్నారా?

జ: అడవులు తగలబడకుండా స్థానికులతో సమావేశాలు నిర్వహిస్తున్నాం. వారి సహకారంతో అడవులు తగలబడకుండా రక్షణ చర్యలు చేపడతాం. ఉగాది దాటిన తరువాత గిరిజన ప్రాంతాల్లో ఇటుకల పండగలు ప్రారంభం కావడంతో గిరిజనులు వేటలో నిమగ్నమవుతారు. ఈ సమయంలోనే స్థానిక ప్రజా ప్రతినిధులు, ఇతర శాఖల ఉద్యోగులతో సమావేశాలు నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నాం. అగ్ని ప్రమాదాల నివారణకు తోడ్పాటు అందించాలని ప్రజలను కోరుతాం.

ప్రశ్న: ఈ ఏడాది రేంజి పరిధిలో ఎంత మేరకు కాంపౌండింగ్ ఫీజు వసూలైంది?

జ: రేంజి పరిధిలో ప్రతి నెలా సుమారుగా రూ.2 లక్షల చొప్పున ఈ ఏడాది ప్రభుత్వానికి సీఫీజు రూపంలో రూ.20 లక్షల వరకు వసూలు చేశాం.

-చోడవరం, ఆంధ్రజ్యోతి

జిల్లా స్థాయి క్విజ్ పోటీలు

చోడవరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఆర్థిక శాస్త్రంలో జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. జిల్లాలోని ఏడు కళాశాలల నుంచి ఇద్దరు చొప్పున విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థిని విజేతగా నిలిచింది. డాక్టర్ వీఎస్‌కే కృష్ణా కాలేజీ విద్యార్థినికి ద్వితీయ స్థానం, నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థినికి తృతీయ స్థానం లభించాయి. విజేతలకు ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ బహుమతులు అందించారు. అలాగే కాలేజీలో జలవనరుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఐవీ.సత్యవతి, ఎకనమిక్స్ హెచ్‌వోడీ డి.రాధాకృష్ణ, ఎన్ఎస్ఎస్ పీవోలు రత్నభారతి, మాల్యాద్రి, బిచ్చమ్మ, అధ్యాపకులు మల్లిబాబు, నారాయణమూర్తి, కృష్ణారావు, లక్ష్మీ మంగమ్మ, జ్యోతి. ఎం.రఫియుద్దీన్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

27న ఉప సర్పంచ్ ఎన్నిక

గొలుగొండ మార్చి, 22 (ఆంధ్రజ్యోతి): పాకలపాడు ఉప సర్పంచ్ ఎన్నికను ఈ నెల 27న నిర్వహిస్తున్నట్టు ఎన్నికల అధికారి చంద్రశేఖర్ శనివారం తెలిపారు. ఉప సర్పంచ్‌గా చేసిన సప్పా రాజేశ్వరి రాజీనామా చేయడంతో ఎన్నిక జరుగుతుందన్నారు. 12 మంది వార్డు సభ్యులూ ఎన్నికకు హాజరుకావాలని నోటీసులు అందించినట్టు ఆయన చెప్పారు. ఆయన వెంట ఈవోపీఆర్‌డీ శ్రీనివాస్, కార్యదర్శి రాజేశ్ ఉన్నారు.

అవగాహనతోనే క్షయ దూరం

మాకవరపాలెం: అవగాహనతోనే క్షయను దూరం చేయవచ్చని వైద్యాధికారి ధీరజ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం విద్యార్థులతో కలసి వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ లక్షణాలను గుర్తిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో రమేశ్ పాల్గొన్నారు.

దాడిపై సీఎం రమేశ్ స్పందించాలి

నర్సీపట్నం: సామాజిక కార్యకర్త శివనారాయణరాజు మీద జరిగిన దాడిపై ఎంపీ సీఎం రమేశ్ స్పందించాలని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. శనివారం కృష్ణాపేలస్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలు పార్టీల నేతలు గురవయ్యయాదవ్ బి.నాగరాజు, పాపారావు, త్రిమూర్తులు, వి.జగన్నాథరావు పాల్గొన్నారు.

టీ20 పోరుకు ఇరు జట్ల సాధన

» ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్



బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తున్న కేఎల్ రాహుల్

విశాఖపట్నం స్పోర్ట్స్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఐపీఎల్ సందడి నెలకొంది. కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మధ్య శనివారం ఐపీఎల్ తొలి మ్యాచ్ జరిగిన నేపథ్యంలో నగరంలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియం వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ మధ్య సోమవారం జరిగే మ్యాచ్‌పై క్రీడాభిమానుల్లో ఆసక్తి పెరిగింది. ఏసీఏ వీడీసీఏ స్టేడియాన్ని తొలి రెండు మ్యాచ్‌లకు హోం గ్రౌండ్‌గా చేసుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాళ్లు నాలుగు రోజుల క్రితమే నగరానికి చేరుకున్నారు. ఈ సీజన్‌లో తొలిమ్యాచ్ ఆడనున్న లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ఆటగాళ్లు శుక్రవారం విశాఖ చేరుకున్న సంగతి తెలిసిందే. ఇరు జట్ల ఆటగాళ్లు శనివారం మధ్యాహ్నం నుంచి ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ముమ్మరంగా సాధన చేశారు. ఢిల్లీ క్యాపిటల్స్‌లోని కీలక క్రికెటర్ కె.ఎల్.రాహుల్ శనివారం జట్టులో చేరి బ్యాటింగ్ సాధన చేశాడు. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషబ్ పంత్‌తోపాటు డేవిడ్ మిల్లర్, మార్క్‌రమ్, అర్యన్ జుయల్, హిమత్ సింగ్, మాథ్యూ, నిచోలాస్ పూరన్, మిశ్చల్ మార్ష్, అబ్దుల్ సమద్, షెహబజ్ అహ్మద్, యువరాజ్ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో క్షయకు చెక్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

శరీరంలో వ్యాధి నిరోధక శక్తి తగ్గితే 'క్షయ' వ్యాధి వస్తుంది. టీబీ రహిత సమాజం కోసం గడిచిన కొన్నాళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రస్థాయిలో కృషి చేస్తున్నప్పటికీ సాధ్యం కావడం లేదు. ఏటా భారీ సంఖ్యలో కొత్త కేసులు నమోదవుతున్నాయి. ఈ వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే ఒక్కోసారి ప్రాణాలను కూడా హరిస్తుంది. సకాలంలో గుర్తించి క్రమం తప్పకుండా మందులు వాడితే ఆరు నెలల్లోనే పూర్తిగా ఈ వ్యాధి నుంచి బయటపడేందుకు అవకాశం ఉంది. ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతోనే ఏటా మార్చి 24న అంతర్జాతీయ క్షయ నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో అందిస్తున్న ప్రత్యేక కథనం...

1882వ సంవత్సరంలో క్షయ వ్యాధికారక క్రిమిని డాక్టర్ రాబర్ట్ కాక్ అనే శాస్త్రవేత్త కనుగొన్నారు. గత కొన్నేళ్లలో వైద్య రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పులు క్షయను సంపూర్ణంగా నయంచేసేందుకు అవసరమైన మందులను అందుబాటులోకి తెచ్చాయి. క్షయ నిర్ధారణ పరీక్షలతోపాటు మందులు కూడా ప్రజలకు చేరువ కావడంతో మరణాలు గణనీయంగా తగ్గాయి. రోగాన్ని నయం చేయడం కంటే ముందు దానిపై స్పష్టమైన అవగాహన కలిగించడం ఎక్కువ ఫలితాన్నిస్తుంది.

వ్యాధికి కారణం ఇది

మైక్రో బాక్టీరియం అనే క్రిమి వల్ల ట్యూబర్ క్యులోసిస్ అనే శాస్త్రీయ నామంతో పిలిచే క్షయ వ్యాధి వ్యాపిస్తుంది. ప్రతి లక్ష మందిలో 206 మంది క్షయ వ్యాధి బారిన పడుతున్నట్టు అధికారులు చెబుతున్నారు. విశాఖపట్నం జిల్లాలో ప్రస్తుతం 1,446 యాక్టివ్ కేసులు ఉన్నాయి. గడిచిన ఏడాది జిల్లాలో 4600 మందికి క్షయ సోకింది. ఆరు నెలలపాటు క్రమం తప్పకుండా మందులు వినియోగించడం ద్వారా పూర్తిగా క్షయ నుంచి కోలుకునే అవకాశం ఉండడంతో యాక్టివ్ కేసుల సంఖ్య తగ్గుతోంది.

లక్షణాలు కనిపిస్తే పరీక్షలు తప్పనిసరి

» వ్యాధి బారినపడిన వారికి మెరుగైన వైద్యం అందిస్తున్న ప్రభుత్వం

» రేపు ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం



నాలుగు కేటగిరీలు

క్షయ వ్యాధిని నాలుగు కేటగిరీలుగా విభజిస్తారు. మొదటిసారి క్షయ వ్యాధి సోకినట్టయితే కేటగిరీ-1గా భావిస్తారు. ఈ కేటగిరీలో ఉన్న వారికి ఆరు నెలలపాటు మందులు అందిస్తారు. పాతవారికి మళ్లీ టీబీ సోకినట్టు గుర్తిస్తే వారిని కేటగిరీ-2గా భావిస్తారు. వీరికి ఎనిమిది నెలలపాటు మందులు అందిస్తారు. కేటగిరీ-3 బారినపడే వారిని మొండి క్షయ వ్యాధి గ్రస్తులు (ఎండీఆర్), కేటగిరీ-4ను ముదిరిపోయిన వ్యాధి గ్రస్తులు (ఎక్స్‌డీఆర్)గా పరిగణిస్తారు. వీరికి తొమ్మిది నుంచి 24 నెలలపాటు మందులు అందిస్తారు. 24 నెలలపాటు మందులు వాడాల్సిన వారిని తీవ్రమైన కేసులుగా పరిగణిస్తారు. వీరికి సుమారు రూ.18 లక్షల విలువైన మందులను ఉచితంగా ప్రభుత్వం అందిస్తూ కోలుకునేలా చేస్తోంది.



అంటు వ్యాధి..

క్షయ అంటు వ్యాధి. ఇది దగ్గు ద్వారా ఇతరులకు వేగంగా వ్యాప్తి చెందుతుంది. ఇంట్లో టీబీతో బాధపడేవారికి మిగిలిన కుటుంబ సభ్యులు కొంత దూరంగా ఉండాలి. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండే రోగులు, చిన్నారులను టీబీ వ్యాధి గ్రస్తులను దూరంగా ఉంచడం ద్వారా వ్యాధి బారినపడకుండా కాపాడవచ్చు.

ప్రోత్సాహకాలు అందిస్తున్న ప్రభుత్వం..

టీబీ వ్యాధిగ్రస్తులను గుర్తించే క్షేత్రస్థాయి ఆరోగ్య సిబ్బంది ఆశ వర్కర్ల రూ.500 చొప్పున, ప్రైవేటు వైద్యులు గుర్తిస్తే వారికి వేయి చొప్పున ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోంది. వ్యాధితో బాధపడే రోగులకు పోషకాహారం కోసం నెలకు రూ.1000 చొప్పున ప్రభుత్వాలు అందిస్తున్నాయి. అలాగే, నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్ విశాఖ జిల్లాకు రూ.33 లక్షల రూపాయలు అందించింది. ఈ మొత్తంతో పోషకాలతో కూడిన కిట్లను 770 మందికి రెండేళ్లపాటు ఇవ్వనున్నారు.

వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం

- డాక్టర్ పూర్ణేంద్రబాబు, జిల్లా టీబీ నియంత్రణ అధికారి



టీబీ వ్యాధి పట్ల అవగాహన చాలా అవసరం. ప్రజలకు ఈ వ్యాధి పట్ల అవగాహన ఉన్నప్పుడే నియంత్రించడం సాధ్యపడుతుంది. ముఖ్యంగా షుగర్ బాధితులు, 60 ఏళ్లు పైబడిన వృద్ధులు, పొగ తాగే అలవాటు ఉన్న వాళ్లు, గుట్కా/పాన్ తినేవారికి పరీక్షలు నిర్వహించి వ్యాధిని నిర్ధారిస్తున్నాం. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనూ పరీక్షలు నిర్వహిస్తున్నారు. అన్ని రకాల మందులు ఆస్పత్రుల్లో మందులు అందుబాటులో ఉన్నాయి. వ్యాధి బారినపడినవారు ఆరు నెలలపాటు క్రమం తప్పకుండా మందులు వినియోగించడం ద్వారా పూర్తిగా కోలుకోవచ్చు.

ఇవీ లక్షణాలు..

టీబీ వ్యాధికి గురిచేసే వైరస్ ఊపిరితిత్తుల్లో నివసిస్తుంది. పోషకాహార లోపంతో బాధపడేవారికి, వెంటిలేషన్ సరిగా లేని ఇళ్లల్లో ఉండే వారికి, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి, షుగర్ బాధితులకు, హెచ్ఐవీ బాధితులకు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండే వారికి ఈ వ్యాధి అధికంగా వచ్చే అవకాశం ఉంది. ఈ వ్యాధి బారినపడిన వారిలో ఎడతెరిపి లేని దగ్గు, దగ్గినప్పుడు రక్తం పడడం, సాయంత్రం వేళ జ్వరం రావడం, నీరసం, బరువు తగ్గడం, ఛాతీలో నొప్పి, ఆయాసం అధికంగా ఉండడం, ఆకలి మందగించడం, కఫం పడినప్పుడు రక్తపు జీరలు పడడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. వీరికి మైక్రోస్కోపీ, ఆర్‌పీసీఆర్, సీబీ నాట్ పరీక్షలు నిర్వహించడం ద్వారా వ్యాధి నిర్ధారిస్తారు.

ఐఐపీయూఈ భూములపై హైకోర్టు తీర్పు

... 5వ పేజీ తరువాయి

ఎక్కువగా రాష్ట్ర ప్రభుత్వం రూ.7 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇచ్చిందని గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో వారు పరిహారం బకాయిలు కోరలేరని స్పష్టతనిచ్చింది. వ్యాజ్యాలను పరిష్కరించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ కుంచం మహేశ్వరరావుతో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది.

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం యూనివర్సిటీ అండ్ ఎనర్జీ (ఐఐపీయూఈ) నిర్మాణం కోసం జరిపిన భూ సేకరణలో భూములు కోల్పోయిన తమకు నష్టపరిహారం చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ అసైన్డ్ పట్టాదారులు, భూములు సాగు చేసుకుంటున్నవారు, భూములపై ఆధారపడి బతుకుతున్న వ్యవసాయ కూలీలు మొత్తం 28 మంది హైకోర్టులో వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై హైకోర్టు ఇటీవల తుది విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదనలు వినిపించారు. విశాఖ జిల్లా కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రాసిన లేఖలో ఎకరం భూమి మార్కెట్ విలువను రూ.13 లక్షలుగా పేర్కొన్నారన్నారు. అయితే అసైన్డ్ రైతులకు రూ. 7లక్షలు మాత్రమే చెల్లించారన్నారు. పట్టా లేకుండా భూమి సాగుచేసుకుంటున్న రైతులకు కూడా 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలన్నారు. జీవనాధారం కోల్పోయిన వ్యవసాయ కూలీల విషయంలో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి వాదనలు వినిపించారు. మార్కెట్ విలువను రూ.7లక్షలుగా నిర్ణయించి అసైన్డ్ రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించిందన్నారు. ఎలాంటి పట్టాలేకుండా భూమిని సాగుచేసుకుంటున్నవారు 2013 భూసేకరణ చట్టం ప్రయోజనాలు పొందేందుకు అనర్హులు అన్నారు. వారికి పునరావాస ప్రయోజనాల కింద ప్రభుత్వం ఇప్పటికే రూ.7లక్షల ఎక్స్‌గ్రేసియా చెల్లించిందన్నారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం... ప్రైవేటు పట్టాదారులతో సమానంగా అసైన్డ్ పట్టాదారులకు పరిహారం చెల్లించాలని సుప్రీంకోర్టు పలు తీర్పులు ఇచ్చిందని ధర్మాసనం గుర్తు చేసింది. 2013 భూసేకరణ చట్టం సైతం ఇదే విషయాన్ని స్పష్టం చేస్తుందని పేర్కొంది. మార్కెట్ విలువను నిర్ధారించేందుకు అటు అధికారులు, ఇటు పిటిషనర్లు ఎలాంటి వివరాలు కోర్టు ముందు ఉంచలేదని గుర్తు చేసింది. జిల్లా కలెక్టర్ 2017 ఫిబ్రవరి 16న ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి రాసిన లేఖలో ఎకరా మార్కెట్ విలువ రూ.13 లక్షలుగా పేర్కొన్నారని, ఈ నేపథ్యంలో డీఫామ్ పట్టా రైతులకు ఎకరాకు రూ.13లక్షల పరిహారంగా చెల్లించాలని తేల్చిచెప్పింది. భూసేకరణతో జీవనాధారం కోల్పోయిన వ్యవసాయ కూలీలకు 2013 భూసేకరణ చట్టం మేరకు ప్రయోజనాలు కల్పించాలని, నాలుగు వారాల్లో తగిన ఉత్తర్వులు జారీ చేయాలని భూసేకరణ అధికారిని ఆదేశించింది.

అన్నదాత హ్యాపీ

... 5వ పేజీ తరువాయి

అల్పపీడనం ప్రభావం వలన ఏర్పడిన తుఫానులు రైతులను భయపెట్టినా వర్షాలు తక్కువగా పడడంతో పెద్దగా నష్టపోలేదు. దాంతో పాటు ప్రారంభం నుంచి వాతావరణం అనుకూలించడంతో రైతులు ఎరువులు, క్రిమి సంహారక మందులను కూడా తక్కువగానే వినియోగించారు. గింజలలో పొల్లు శాతం బాగా తక్కువగా ఉందని రైతులు చెబుతున్నారు.

ఆస్తి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి

... 5వ పేజీ తరువాయి

చేశారు. ఎలమంచిలి మునిసిపాలిటీ పరిధిలోని 10,910 మంది అసెస్‌మెంట్ల నుంచి ఆస్తి పన్ను ఈ నెలాఖరులోగా రూ.4.40 కోట్లు వసూలు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇటీవల వరకు రూ.2.70 కోట్లు వసూలైంది. ఇంకా రూ.1.70 కోట్లు వసూలు కావాల్సి ఉంది. నర్సీపట్నం మునిసిపాలిటీ పరిధిలోని 14,458 మంది నుంచి ఆస్తి పన్ను రూ.5.69 కోట్లు వసూలు లక్ష్యం కాగా, ఈనెల 20 నాటికి రూ.4.68 కోట్లు వసూలైంది. ఇంకా రూ.1.01 కోట్లు మాత్రమే వసూలు చేయాల్సి ఉంది. అధికారులు ఈ నెలాఖరులోగా పన్ను వసూళ్ల లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేస్తున్నారు.

గ్రామ పంచాయతీల్లో వెనుకంజ

జిల్లాలో 646 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆయా పంచాయతీల పరిధిలో ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి రూ.34.87 కోట్లు పన్ను వసూలు లక్ష్యంగా పెట్టుకున్నారు. జిల్లా పంచాయతీ అధికారుల నివేదికల ప్రకారం శనివారం నాటికి జిల్లాలో రూ. 24.62 కోట్లు వసూలైంది. ఇంకా రూ.10.25 కోట్లు వసూలు కావాల్సి ఉంది. జిల్లాలో గొలుగొండ, రోలుగుంట మండలాల పరిధిలో పన్ను వసూళ్లు 80 శాతం కంటే ఎక్కువగా నమోదు కాగా, మిగిలిన మండలాల్లో 50 శాతం మాత్రమే పన్ను వసూలు జరిగింది. ఈ నెలాఖరులోగా అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో శత శాతం పన్ను వసూలు లక్ష్యంగా ప్రయత్నాలు జరుగుతున్నాయని పంచాయతీ అధికారులు చెబుతున్నారు.

గోవాడలో రూ.300 కోట్లతో డిస్టిలరీ

... 5వ పేజీ తరువాయి

చెరకు రైతులకు న్యాయం చేయాలన్నది తన లక్ష్యమని స్పష్టం చేశారు. గోవాడకు ఆస్తులు, అప్పులు కూడా ఉన్నాయని, కేంద్రం ద్వారా డిస్టిలరీ ఏర్పాటు చేసి, మిగిలిన నిధులతో అప్పులు తీర్చి, గోవాడ సభ్య రైతులు గర్వపడేలా ఫ్యాక్టరీని తీర్చిదిద్దుతామని ఆయన చెప్పారు. గోవాడపై విమర్శలు చేస్తున్న వైసీపీ నేతలు బొత్స ఇతర నేతలు తమ హయాంలోనే భీమసింగి, తాండవ, ఏటికొప్పాకలు మూతపడిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ నాగగంగాధర్ పాల్గొన్నారు.

నేడు, రేపు పలు రైళ్లు రద్దు

విశాఖపట్నం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్ పరిధిలో నిర్మాణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఈనెల 23, 24 తేదీల్లో పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేశామని వాల్తేరు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈనెల 23న (ఆదివారం) గుంటూరు-విశాఖ సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17239)ను, 24న విశాఖ-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17240), గుంటూరు-విశాఖ సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17239), కాకినాడ-విశాఖ మెము పాసింజర్ (17267), విశాఖ-కాకినాడ మెము పాసింజర్ (17268), రాజమండ్రి-విశాఖ మెము పాసింజర్ (67285), విశాఖ-రాజమండ్రి మెము పాసింజర్ (17286), విశాఖ-గుంటూరు ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22875), గుంటూరు-విశాఖ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22876)లను రద్దు చేశామని పేర్కొన్నారు. అలాగే 25న కూడా విశాఖ-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17240) రద్దు చేశామన్నారు.

బెట్టింగ్ భూతం

... 5వ పేజీ తరువాయి

ఫోన్‌ల ద్వారా వేస్తారు. ఒకవేళ బుకీ ఫోన్‌కు స్పందించకపోయినా, అతను పోలీసులకు దొరికినా డబ్బులు రావు. రెండో రకం బెట్టింగ్ యాప్స్ ఇవి అత్యంత ప్రమాదకరమైనవి. ప్రస్తుతం మార్కెట్‌లో 20కుపైగా బెట్టింగ్ యాప్స్ ప్రచారంలో ఉన్నాయి. వివిధ రకాల ఆఫర్లు, బోనస్‌ల పేరిట యువతను ఈ యాప్స్ ఆకట్టుకుంటున్నాయి. ఒకసారి ఈ యాప్స్‌ను వినియోగిస్తే బయటకు రావడం అంత తేలికకాదు. వివిధ రకాల పేమెంట్ యాప్స్ నుంచి నేరుగా ఆయా అకౌంట్లలోకి డబ్బులు జమ చేసి...క్షణాల్లో బెట్టింగ్ వేసుకునే వెసులుబాటు ఉండడంతో ఎంతోమంది విద్యార్థులు, ఉద్యోగులు రూ.లక్షల్లో నష్టపోయి ప్రాణాలను తీసుకునే వరకూ వెళుతున్నారని సైకాలజిస్టులు చెబుతున్నారు. బెట్టింగ్ వల్ల నష్టపోయిన వాళ్లే తప్ప...లాభపడిన వాళ్లు ఒక్కరు కూడా కనిపించరు.

కుటుంబ సభ్యుల బాధ్యత..

బెట్టింగ్‌కు దూరంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత కుటుంబ సభ్యులదేనని నిపుణులు చెబుతున్నారు. పిల్లలు ఈ రెండు నెలలపాటు ఇంటికి దూరంగా వెళ్లకుండా చూడాలి. ఒకవేళ వెళ్లినా రాత్రి ఇంటికి వచ్చేలా జాగ్రత్తపడాలి. వారికి ప్రత్యేక గదులు ఇవ్వకుండా అందరూ కలిసి ఉండడం మంచిది. అకౌంట్లలో భారీ మొత్తాలు లేకుండా చూసుకోవాలి. పిల్లల అకౌంట్లలో డబ్బులు లేకుండా చూసుకోవడం అత్యంత కీలకం. వారి ఫోన్లలో పేమెంట్ యాప్స్ ఉంటే వాటిని తీసేయాలి. అలాగే, ఉద్యోగుల విషయంలో కూడా కుటుంబ సభ్యులు జాగ్రత్తగా ఉండాలి. మ్యాచ్ చూస్తూ ఫోన్లు మాట్లాడుతున్నా, అదే పనిగా ఫోన్ పట్టుకుని మ్యాచ్‌లు వీక్షిస్తున్నా, తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నా, మ్యాచ్ చూస్తూ అతిగా స్పందిస్తున్నా...ఒక్కోరోజు అధిక మొత్తంలో డబ్బులు తెచ్చి ఇస్తున్నా, కొన్నిసార్లు అవసరానికి మించి డబ్బు అడుగుతున్నా అప్రమత్తం కావాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇవన్నీ బెట్టింగ్ కాసేందుకు అవకాశం ఉండే అంశాలుగా నిపుణులు పేర్కొంటున్నారు.

బయటకు తీసుకురావడం ఒకింత క్లిష్టమైన ప్రక్రియ

- డాక్టర్ ఎన్ఎన్ నిహాల్, మానసిక నిపుణులు

బెట్టింగ్ వ్యసనం బారినపడిన వారిని బయటకు తీసుకురావడం చాలా క్లిష్టమైన ప్రక్రియ. ఈ వ్యసనానికి గురైనవాళ్లు తీవ్రమైన నష్టాల్లో కూరుకుపోతుంటారు. ఆర్థికంగా తీవ్ర అగాధంలోకి వెళ్లిపోతారు. మొదట్లో తక్కువ మొత్తంతోనే ప్రారంభిస్తారు. ఆ తరువాత అది ఏ స్థాయికి వెళుతుందో చెప్పలేము. డబ్బులు దొరికిన చోటల్లా అప్పులు వాడేస్తుంటారు. అది ఎంత అన్న విషయం కూడా వారికి పట్టదు. బయటకు వచ్చేసరికి రూ.లక్షలు దాటుతుంది. ఇటువంటి వారిని వేగంగా గుర్తించి కౌన్సెలింగ్, కొన్నిరకాల మందులు ఇవ్వడం ద్వారా సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు అవకాశం ఉంది.

క్రైం... crime news

రెండు లారీలు ఢీకొని డ్రైవర్ మృతి



షేక్ మస్తాన్ వలీ మృతదేహం

కశింకోట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రెండు లారీలు ఢీకొన్న ప్రమాదంలో ఓ లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిసిన వివరాలివి. అనకాపల్లి నుంచి ఎలమంచిలి వైపు వెళుతున్న లారీ ఎన్.జి.పాలెం సమీపంలో ఉన్న త్రిపురవానిపాలెం కూడలి వద్ద ఎటువంటి సిగ్నల్ ఇవ్వకుండా డ్రైవర్ యూ టర్న్ తీసుకున్నాడు. అదే మార్గంలో వెనుక నుంచి వస్తున్న మరో లారీ ఈ లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో వెనుక లారీలోని డ్రైవర్ షేక్ మస్తాన్ వలి(62) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. అతను పల్నాడు జిల్లా ఎడ్లపూడి మండలం వంకాయలపాడు గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. అదే లారీలో ఉన్న క్లీనర్ స్వల్పంగా గాయపడ్డాడని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి మృతుని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

నాలుగేళ్ల కిందటి హత్య కేసును ఛేదించిన పోలీసులు

» రౌడీ షీటర్ హత్య కేసులో ఇద్దరి అరెస్టు

విశాఖపట్నం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల కిందట జరిగిన రౌడీషీటర్ హత్య కేసును నగర పోలీసులు ఛేదించారు. కేసు దర్యాప్తులో ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో అన్ డిటెక్టబుల్ (యూఎన్) కేసుగా పేర్కొంటూ 2022 ఆగస్టులో కేసు మూసేశారు. సీపీ శంఖబ్రతబాగ్చి యూఎన్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, నాలుగేళ్ల కిందట జరిగిన రౌడీషీటర్ హత్య కేసు దర్యాప్తు బాధ్యతలను కంట్రోల్‌రూమ్ సీఐ షేక్ హుస్సేన్‌కు అప్పగించారు. కేసు పూర్వపరాలను పరిశీలించిన సీఐ హుస్సేన్ దర్యాప్తు ప్రారంభించి హత్యకు పాల్పడిన నిందితులను గుర్తించి అరెస్టు చేశారు. పోలీస్ కమిషనరేట్‌లో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశం సీపీ శంఖబ్రతబాగ్చి దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు.

జ్ఞానాపురానికి చెందిన గనగళ్ల శ్రీను అలియాస్ మెంటల్ శ్రీను అలియాస్ ఇంద్రజిత్ (45) పోర్టు ఏరియాలో తుక్కు చోరీలు చేస్తూ జీవిస్తుండేవాడు. శ్రీనుపై హార్బర్ పోలీస్ స్టేషన్‌లో సస్పెక్ట్‌షీట్‌తోపాటు టూటౌన్ స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. 2021 ఏప్రిల్ 22న కంచరపాలెం మెట్టు పైడిమాంబ ఆలయం వద్ద గుర్తు తెలియని వ్యక్తి ఒకరు హత్యకు గురైనట్టు 112 నంబర్‌కు స్థానికులు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకుని మృతుడు గనగళ్ల శ్రీనుగా గుర్తించారు. దీనిపై కేసు నమోదుచేసిన కంచరపాలెం పోలీసులు దర్యాప్తులో ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో కేసును 2022లో మూసేశారు. ఇటీవల యూఎన్ కేసులను తిరిగి తెరిచి దర్యాప్తు చేయాలని సీపీ శంఖబ్రతబాగ్చి ఆదేశించారు. అందులో భాగంగా గనగళ్ల శ్రీను హత్యకేసు దర్యాప్తును కంట్రోల్‌రూమ్ సీఐ షేక్‌హుస్సేన్‌కు అప్పగించారు. కేసు దర్యాప్తు ప్రారంభించిన హుస్సేన్ హత్యకు గురైన శ్రీనుకు ఎవరెవరితో పరిచయాలు ఉన్నాయి, ఎవరెవరితో విభేదాలు ఉన్నాయనే దానిపై కొబ్బరితోట, భూపేష్‌నగర్, అల్లిపురం, రైల్వేక్వార్టర్స్, జ్ఞానాపురం, కంచరపాలెం వంటి ప్రాంతాల్లో 28 మంది తుక్కు వ్యాపారులు, తుక్కు దొంగలతో పాటు 35 మంది హిజ్రాలను కలిసి ఆరా తీశారు. ఈ క్రమంలో తుక్కు చోరీలు చేసి జీవనం సాగించే అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం జంగవానిపాలేనికి చెందిన లాలం గణేష్‌కు, శ్రీనుకు విభేదాలు ఉన్నట్టు తేలింది. శ్రీను సోదరుడైన తోటయ్య ఒక సెల్‌ఫోన్‌ను చోరీ చేసి లాలం గణేష్ సోదరుడైన లాలం శ్రీనుకు విక్రయించగా, పోలీసులు టెక్నాలజీ ఆధారంగా చోరీకి గురైన సెల్‌ఫోన్‌ను రికవరీ చేశారు. తోటయ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. తోటయ్యకు బెయిల్ కోసం రూ.పదివేలు ఖర్చు అవ్వడంతో లాలం శ్రీను, గణేష్ వల్లే తన సోదరుడు పోలీసులకు దొరికిపోయాడని, రూ.పదివేలు బెయిల్ కోసం ఖర్చయిందని గనగళ్ల శ్రీను రగిలిపోతుండేవాడు. బెయిల్ కోసం ఖర్చయిన డబ్బుల కోసం లాలం గణేష్‌తో తరచూ గొడవపడేవాడు. ఈ క్రమంలో 2021 ఏప్రిల్ 16న లాలం గణేష్, గనగళ్ల శ్రీను కొట్టుకున్నారు. గణేష్‌కు ఆ సమయంలో అతనితోపాటు ఉన్న పెదగంట్యాడకు చెందిన తుక్కు దొంగ కొమర తారకేశ్వరరావు సహకరించాడు. ఇద్దరూ కలిసి శ్రీనుని హత్య చేసి, మర్మాంగాన్ని కత్తిరించి రైల్వే ట్రాక్ పక్కనపడేసి వెళ్లిపోయారు. పోలీసులు సేకరించిన సమాచారం ఆధారంగా గణేష్, తారకేశ్వరరావును విచారించగా నేరాన్ని అంగీకరించారు. వారి నుంచి హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు ఈ కేసు దర్యాప్తులో ప్రతిభ చూపిన సీఐ హుస్సేన్‌తోపాటు ఇతర సిబ్బందికి సీపీ రివార్డులు అందజేశారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	85.00
లైవ్ ధర	105.00
విత్ స్కిన్	180.00
స్కిన్ లెస్	190.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	420
విజయనగరం	424
శ్రీకాకుళం	424